RNI TEL TEL 2024/89323.

# జన సంఘర్షణ

మా లక్ష్యం సామాన్యుని పక్షం

తెలుగు దినపత్రిక

| నిజామాబాద్ | సంపుటి : 03 | సంచిక : 79 | ఏప్రిల్ 08 బుధవారం 2026 | ఎడిటర్ : రాచమల్లు మాధవి | పేజీలు 08 | వెల : రూ. 6.00 |
|---|---|---|---|---|---|---|
| Nizamabad | Vol: 03 | Vol: 79 | April 08 Wednesday 2026 | Editor : rachamallu madhavi | Pages 08 | Cost: Rs 6.00 |

పేదల భూములు లాక్కొంటారా...? హరీశ్‌రావు నిప్పులు 2

## రాబోయే మూడు రోజులు వర్షాలు



హైదరాబాద్ జనసంఘర్షణ
తెలుగు రాష్ట్రాల్లో రాబోయే మూడు రోజుల పాటు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది. ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్‌లోని ఉత్తరాంధ్ర, కోస్తాంధ్ర ప్రాంతాల్లో మేఘావృతమైన వాతావరణంతో పాటు ఎడతెరిపి లేని వర్షాలు కురిసే సూచనలు ఉన్నాయి. తెలంగాణలోని జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, నల్గొండ, ఖమ్మం జిల్లాల్లో వర్షాలు పడే అవకాశం ఉండగా.. సూర్యపేట, వరంగల్, జనగామ, సిద్దిపేట జిల్లాల్లో మోస్తరు వర్షాలు కురిసే వీలుంది. వర్షాలతో పాటు పిడుగులు పడే ప్రమాదం ఉన్నందున ప్రజలు అత్యంత అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం పడుతున్నప్పుడు బహిరంగ ప్రదేశాల్లో సంచరించకూడదని, సురక్షితమైన భవనాల్లో ఆశ్రయం పొందాలని వెల్లడించారు. పిడుగుల ముప్పు పొంచి ఉన్న నేపథ్యంలో వాతావరణ శాఖ పలు కీలక జాగ్రత్తలను సూచించింది. సాధారణంగా పిడుగులు తాటి చెట్లు, విద్యుత్ స్తంభాలపై ఎక్కువగా పడే అవకాశం ఉన్నందున, వర్షం పడే సమయంలో విద్యుత్ తీగలు లేదా ట్రాన్స్‌ఫార్మర్ల సమీపంలో ఉండవద్దని

➢ మిగతా 2వ పేజీలో..

## యువతను వంచిస్తున్న విజయన్ ప్రభుత్వం

### సీఎం రేవంత్ రెడ్డి.. పినరయ్‌పై తీవ్ర విమర్శలు



తిరువనంతపురం జనసంఘర్షణ
కేరళ అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కేరళ సీఎం పినరయి విజయన్‌పై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. కేరళ ప్రజలను, ముఖ్యంగా యువతను విజయన్ ప్రభుత్వం వంచిస్తోందని ఆయన ఆరోపించారు. కేరళలో ఎల్‌డీఎఫ్ ప్రభుత్వానికి కాలం చెల్లిందని, వచ్చే ఎన్నికల్లో యూడీఎఫ్ విజయం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ప్రధాని నరేంద్ర మోదీ, పినరయి విజయన్ ఇద్దరూ రహస్య మిత్రులని, అందుకే విజయన్‌పై ఉన్న అవినీతి కేసుల విషయంలో కేంద్రం ఉదాసీనంగా వ్యవహరిస్తోందని రేవంత్ విమర్శించారు. మోదీ సూచనల మేరకే విజయన్ పాలన సాగిస్తున్నారని, వీరిద్దరి మధ్య కుదిరిన ఒప్పందం వల్లనే ఒకరిపై ఒకరు విమర్శలు చేసుకోరని ఎద్దేవా చేశారు. తన ప్రసంగంలో పినరయి విజయన్‌ను గత తెలంగాణ సీఎం కేసీఆర్‌తో పోలుస్తూ.. ప్రజలను కాదని తామే శాశ్వతమని భావించే వారికి తెలంగాణలో పట్టిన గతే కేరళలోనూ పడుతుందని హెచ్చరించారు. కేరళ యువత ఎంతో కష్టపడి పనిచేసే తత్వమున్న వారని, గల్ఫ్ దేశాల అభివృద్ధిలో వారి పాత్ర కీలకమని కొనియాడిన రేవంత్, రాష్ట్రంలో అవకాశాలు లేక వారు ఇబ్బందులు

➢ మిగతా 2వ పేజీలో..

## మావోయిస్టుల శకం ముగిసింది

### ప్రకటించిన డీజీపీ శివధర్‌రెడ్డి



హైదరాబాద్ జనసంఘర్షణ
తెలంగాణలో దశాబ్దాల పాటు కొనసాగిన మావోయిస్టుల శకం అధికారికంగా ముగిసిందని రాష్ట్ర డీజీపీ బి. శివధర్ రెడ్డి ప్రకటించారు. ఒకప్పుడు తుపాకుల మోతతో, అశాంతితో నిండిన అటవీ ప్రాంతాల్లో ఇప్పుడు శాంతి నెలకొందని, మావోయిజం పూర్తిగా అంతరించిందని ఆయన వెల్లడించారు. ములుగు జిల్లాలోని అత్యంత మారుమూల ప్రాంతమైన కర్రెగట్టుల (కర్రెగుట్టలు) పరిధిలో పర్యటించిన డీజీపీ, అక్కడ మారుతున్న పరిస్థితులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. కేంద్రం చేపట్టిన 'ఆపరేషన్ కగార్' విజయవంతం కావడంతో పాటు, కీలక మావోయిస్టు నాయకత్వం లొంగిపోవడంతో ఆ వ్యవస్థ పూర్తిగా కుప్పకూలిందని ఆయన వివరించారు. ఇప్పుడు ఈ ప్రాంతాలు నక్సల్ రహిత జోన్లుగా మారాయని, ప్రజలు ఎటువంటి భయం లేకుండా స్వేచ్ఛగా తిరుగుతున్నారని

➢ మిగతా 2వ పేజీలో..

## ఇరాన్ నాగరికతను అంతం చేస్తాం




వాషింగ్టన్ జనసంఘర్షణ
అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇరాన్‌ను ఉద్దేశించి మరోసారి అత్యంత కఠినమైన హెచ్చరికలు జారీ చేశారు. ఇరాన్ నాగరికత ఈ రాత్రితో అంతం కావడం ఖాయమని, దానిని మళ్లీ ఎప్పటికీ పునరుద్ధరించలేరని ఆయన తన 'ట్రూత్ సోషల్' వేదికగా సంచలన పోస్ట్ చేశారు. ఇరాన్‌లో గత 47 ఏళ్లుగా కొనసాగుతున్న అవినీతి, అరాచక పాలనకు ముగింపు పలకబోతున్నామని, ప్రపంచ చరిత్రలో ఈ రాత్రి ఒక మైలురాయిగా నిలిచిపోతుందని ఆయన పేర్కొన్నారు. ఒక దేశాన్ని ఈ విధంగా తుడిచిపెట్టడం తనకు ఇష్టం లేకపోయినా, ప్రస్తుత పరిస్థితుల్లో ఆ చర్యలు తప్పడం లేదని వ్యాఖ్యానించారు. ఇరాన్ కీలకమైన హర్మూజ్ జలసంధిని వెంటనే తెరవకపోతే ఆ దేశంలోని వంతెనలు, విద్యుత్ కేంద్రాలు మరియు మౌలిక సదుపాయాలపై విధ్వంసకర దాడులు తప్పవని హెచ్చరించారు. ఇప్పటికే ఇరాన్‌లోని ఖర్గ్ ఐలాండ్‌లో ఉన్న సుమారు 50 లక్ష్యాలపై

➢ మిగతా 2వ పేజీలో..

## పాక్‌లో లాక్‌డౌన్

### ఇంధన కొరతతో విధింపు



న్యూఢిల్లీ జనసంఘర్షణ
ఇరాన్ హర్మూజ్ జలసంధి గుండా ముడి చమురు మరియు సహజవాయువు రవాణాపై ఆంక్షలు విధించిన నేపథ్యంలో, ప్రపంచవ్యాప్తంగా ఇంధన సంక్షోభం ముదురుతోంది. ఈ ప్రభావం పాకిస్థాన్‌పై తీవ్రంగా పడటంతో ఆ దేశంలో ఇంధన కొరత ఏర్పడింది. పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుకు పాక్ ప్రభుత్వం అనూహ్య నిర్ణయం తీసుకుంటూ దేశవ్యాప్తంగా లాక్‌డౌన్ తరహా ఆంక్షలను అమలులోకి తెచ్చింది. విద్యుత్ మరియు ఇంధన పొదుపు చర్యలపై ఉన్నత స్థాయి సమావేశం

➢ మిగతా 2వ పేజీలో..

## మాజోలికొస్తే పాక్ ముక్కలే

### భారత రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ హెచ్చరిక



న్యూఢిల్లీ జనసంఘర్షణ
భారత రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ పాకిస్థాన్‌కు తీవ్రస్థాయిలో హెచ్చరికలు జారీ చేశారు. ఇటీవల పాక్ రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్ భారత్‌ను ఉద్దేశించి చేసిన వివాదాస్పద వ్యాఖ్యలపై ఆయన ఘాటుగా స్పందించారు.

➢ మిగతా 2వ పేజీలో..

## మతపరమైన సాంప్రదాయమే..

- మహిళపట్ల ఎలాంటి వివక్ష లేదు



న్యూఢిల్లీ జనసంఘర్షణ
శబరిమల ఆలయంలో మహిళల ప్రవేశంపై కొనసాగుతున్న నిషేధం కేవలం మతపరమైన విశ్వాసాలకు మరియు ప్రాచీన సంప్రదాయాలకు సంబంధించిందే తప్ప, ఇందులో మహిళల పట్ల ఎలాంటి వివక్ష లేదని కేంద్ర ప్రభుత్వం సుప్రీంకోర్టుకు స్పష్టం చేసింది. శతాబ్దాలుగా కొనసాగుతున్న ఈ ఆచారాలను మార్చడం వల్ల ఆరాధనా

➢ మిగతా 2వ పేజీలో..

# యువతను వంచిస్తున్న విజయన్ ప్రభుత్వం

**మొదటిపేజీ తరువాయి..** పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విజయన్ ప్రభుత్వం జ్యోతి బసు, సోమనాథ్ ఛటర్జీ వంటి మహోన్నత వామపక్ష నాయకుల ఆదర్శాలను విస్మరించిందని విమర్శించారు. మలయాళీ సినిమాలోని ప్రసిద్ధ డైలాగ్ "నీ పో మోనే విజయ్.. నీ టైమ్ అయిపోయింది" అంటూ ఆయన చేసిన వ్యాఖ్యలు ప్రచారంలో ఆసక్తిని రేకెత్తించాయి. విజయన్, మోదీ ఇద్దరూ రాజకీయ సోదరులని, వారి నుంచి కేరళకు విముక్తి కలిగించడమే కాంగ్రెస్ లక్ష్యమని రేవంత్ స్పష్టం చేశారు.

# మావోయిస్టుల శకం ముగిసింది

**మొదటిపేజీ తరువాయి..** ఆయన పేర్కొన్నారు. గతంలో కనీస వసతులు లేకపోవడమే ఈ ప్రాంతాల్లో నక్సలిజం వేళ్లూనుకోవడానికి కారణమని గుర్తించిన ప్రభుత్వం, ఇప్పుడు అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించింది. బాహ్య ప్రపంచంతో సంబంధం లేని కర్రెగుట్టల వంటి అటవీ ప్రాంతాలకు ఇప్పుడు బీటీ రోడ్ల నిర్మాణం వేగంగా జరుగుతోంది. ఆదివాసీల రవాణా సౌకర్యాల కోసం ప్రభుత్వం ప్రత్యేకంగా ఆటోలు, ద్విచక్ర వాహనాలను కమ్యూనిటీ వాహనాలుగా అందజేసింది. దీనివల్ల గతంలో కిలోమీటర్ల కొద్దీ నడవాల్సిన అవసరం తప్పిందని డీజీపీ తెలిపారు. విద్యుత్ సౌకర్యం లేని ఇళ్లకు సోలార్ లైట్లు పంపిణీ చేయడంతో పాటు, ఆధార్ కార్డులు, ఓటు హక్కు వంటి కనీస గుర్తింపు పత్రాలను కూడా అందిస్తున్నట్లు వెల్లడించారు. ఈ అటవీ ప్రాంతాలను పర్యాటక కేంద్రాలుగా తీర్చిదిద్దే అవకాశం ఉందని, తుపాకీ గొట్టం ద్వారా కాకుండా అభివృద్ధి ద్వారానే శాశ్వత మార్పు సాధ్యమని తెలంగాణ ప్రభుత్వం నిరూపిస్తోందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

# రాబోయే మూడు రోజులు వర్షాలు

**మొదటిపేజీ తరువాయి..** హెచ్చరించింది. పిడుగులు పడే సమయంలో గొడుగుల ఇనుప చువ్వలు, కెమెరాలు, సెల్‌ఫోన్లు వంటి ఎలక్ట్రానిక్ వస్తువులను దగ్గర ఉంచుకోకపోవడం ఉత్తమమని తెలిపింది. రైతులు తమ పశువులను చెట్ల కింద కాకుండా సురక్షితమైన షెడ్లలో ఉంచాలని, పొలాల వద్ద పని చేస్తున్న వారు ఉరుముల శబ్దం రాగానే సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని సూచించింది. ప్రయాణికులు, రైతులు మారుతున్న వాతావరణ పరిస్థితులను ఎప్పటికప్పుడు గమనిస్తూ తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు స్పష్టం చేశారు.

# ఇరాన్ నాగరికతను అంతం చేస్తాం

**మొదటిపేజీ తరువాయి..** అమెరికా దళాలు దాడులు జరిపినట్లు శ్వేతసౌధం వెల్లడించింది. ఆ ద్వీపాన్ని పూర్తిగా స్వాధీనం చేసుకునేందుకు మెరైన్ దళాలతో భారీ ఆపరేషన్‌కు అగ్రరాజ్యం సిద్ధమవుతున్నట్లు సమాచారం. ఇరాన్‌లోని పౌర మౌలిక సదుపాయాలపై దాడులు చేయడం అంతర్జాతీయ నేరమని ఐక్యరాజ్యసమితి చీఫ్ ఆంటోనియో గుటెరస్ హెచ్చరించినప్పటికీ, అమెరికా-ఇజ్రాయెల్ దళాలు తమ దాడులను ఉధృతం చేస్తున్నాయి. దీనిపై ఇరాన్ కూడా దీటుగా స్పందించింది. తమది పురాతన నాగరికతని, అమెరికా మరియు దాని మిత్రదేశాలు ఇరాన్ నుండి కోలుకోలేని దెబ్బను రుచి చూడబోతున్నాయని దక్షిణ ఆఫ్రికాలోని ఇరాన్ ఎంబసీ హెచ్చరించింది. ఇరు దేశాల మధ్య నెలకొన్న ఈ యుద్ధ వాతావరణం ప్రపంచ దేశాలను తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది.

# పాక్‌లో లాక్‌డౌన్

**మొదటిపేజీ తరువాయి..** నిర్వహించిన అనంతరం ప్రధానమంత్రి షెహబాజ్ షరీఫ్ ఈ కొత్త నిబంధనలను ప్రకటించారు. దేశవ్యాప్తంగా ఇంధన వినియోగాన్ని తగ్గించడమే లక్ష్యంగా వాణిజ్య కార్యకలాపాలపై కఠినమైన పరిమితులు విధించారు. రేడియో పాకిస్థాన్ వెల్లడించిన వివరాల ప్రకారం, దేశంలోని మార్కెట్లు, షాపింగ్ మాల్స్ మరియు ఇతర వాణిజ్య సముదాయాలను ప్రతిరోజూ రాత్రి 8 గంటలకే మూసివేయాల్సి ఉంటుంది. అయితే డివిజనల్ హెడ్ క్వార్టర్స్ పరిధిలోని ప్రాంతాలకు మాత్రం రాత్రి 9 గంటల వరకు వెసులుబాటు కల్పించారు. ఆహార విక్రయశాలలు, బేకరీల వంటివి రాత్రి 10 గంటల కల్లా మూతపడాలి. ప్రజలు తమ ఇళ్లలో నిర్వహించుకునే వివాహాది శుభకార్యాలను కూడా రాత్రి 10 గంటల లోపే ముగించాలని ప్రభుత్వం స్పష్టం చేసింది. అత్యవసర సేవలైన ఫార్మసీలు, ఇతర ఆరోగ్య సంరక్షణ కేంద్రాలకు మాత్రం ఈ నిబంధనల నుండి మినహాయింపునిచ్చారు. చమురు సరఫరాలో అంతరాయం కలగడం వల్ల ఆర్థిక వ్యవస్థ కుప్పకూలకుండా ఉండేందుకు పాకిస్థాన్ ప్రభుత్వం ఈ కఠిన నిర్ణయాలు తీసుకుంది.

## మీడియా సంస్థలపై దాడులు సరికాదు: రామ్

**హైదరాబాద్, ఏప్రిల్7 :** ఏబీఎన్ ఆంధ్రజ్యోతి సంస్థల మీద వైసీపీ నేతలు చేసిన దాడిని తాము తీవ్రంగా ఖండిస్తున్నామని తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు రామచందర్ రావు పేర్కొన్నారు. ప్రజస్వామ్యంలో మీడియాపై దాడులు చేయడం సరైన పద్ధతికాదన్నారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. గతంలో కేసీఆర్ హయాంలో ఉన్నప్పుడు ఇదే తరహా దాడులు చేసేవారని ప్రస్తావించారు. రాజకీయ విమర్శలు ఉంటే రాజకీయంగా చూసుకోవాలని.. బెదిరింపు ధోరణి సరికాదన్నారు. బాధ్యతాయుతమైన సంస్థపై వైసీపీ నేతలు చేసిన దాడిని ఖండిస్తున్నామని రామచందర్ రావు పేర్కొన్నారు.

# మాజోలికొస్తే పాక్ ముక్కలే

**మొదటిపేజీ తరువాయి..** భవిష్యత్తులో భారత్ ఏదైనా చర్యలకు దిగితే కోల్‌కతాను లక్ష్యంగా చేసుకుంటామని ఖవాజా ఆసిఫ్ చేసిన హెచ్చరికలను రాజ్‌నాథ్ తప్పుబట్టారు. ఇలాంటి రెచ్చగొట్టే ప్రకటనలు చేయడం పాకిస్థాన్‌కే ప్రమాదకరమని, గతంలో ఇలాంటి ధోరణి వల్లే 55 ఏళ్ల క్రితం ఆ దేశం రెండు ముక్కలై బంగ్లాదేశ్ ఏర్పడిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. ఒకవేళ పాకిస్థాన్ గనుక బెంగాల్ వైపు కన్నెత్తి చూస్తే, ఈసారి ఆ దేశం ఎన్ని ముక్కలవుతుందో భగవంతుడికే తెలియాలంటూ ఆయన తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఇస్లామాబాద్ ఉద్రిక్తతలను పెంచేలా మాట్లాడటం మానుకోవాలని సూచించారు. మరోవైపు, పాక్ మంత్రి వ్యాఖ్యలపై కేంద్ర ప్రభుత్వం వెంటనే స్పందించకపోవడాన్ని పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ, టీఎంసీ ఎంపీ అభిషేక్ బెనర్జీ విమర్శించారు. కోల్‌కతాపై దాడి చేస్తామని బెదిరించినా ప్రధాని మోదీ, అమిత్ షా ఎందుకు మౌనంగా ఉన్నారని వారు ప్రశ్నించారు. పాక్ ఆక్రమిత కాశ్మీర్‌ను తిరిగి స్వాధీనం చేసుకునేందుకు భారత సైన్యానికి స్వేచ్ఛనివ్వాలని డిమాండ్ చేస్తూ ప్రధాని రాజీనామాకు కూడా పట్టుబట్టారు. ఈ రాజకీయ విమర్శల నేపథ్యంలో, రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ నేరుగా రంగంలోకి దిగి పాకిస్థాన్‌కు గట్టి కౌంటర్ ఇవ్వడం ఇప్పుడు ప్రాధాన్యత సంతరించుకుంది. భారత ప్రాదేశిక సమగ్రత విషయంలో రాజీ పడే ప్రసక్తే లేదని ఆయన తన వ్యాఖ్యల ద్వారా స్పష్టం చేశారు.

# మతపరమైన సాంప్రదాయమే..

**మొదటిపేజీ తరువాయి..** స్వరూపమే దెబ్బతింటుందని, ఇది పూర్తిగా మత స్వేచ్ఛకు సంబంధించిన అంశమని కేంద్రం వాదించింది. 2018లో మహిళల ప్రవేశానికి అనుమతిస్తూ ఇచ్చిన తీర్పుపై దాఖలైన రివ్యూ పిటిషన్లను జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని తొమ్మిది మంది సభ్యుల విస్తృత ధర్మాసనం ప్రస్తుతం విచారిస్తోంది. ఈ సందర్భంగా కేంద్రం తరఫున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా తన వాదనలు వినిపిస్తూ, మతపరమైన ఆచారాలు న్యాయ సమీక్షకు అతీతమని అభిప్రాయపడ్డారు. ప్రతి మతపరమైన పద్ధతిని రాజ్యాంగం రక్షిస్తుందని, అన్నింటినీ వ్యక్తిగత స్వేచ్ఛ లేదా హక్కులతో ముడిపెట్టలేమని కేంద్రం పేర్కొంది. మసీదులు లేదా గురుద్వారాలలో పాటించే నిబంధనల తరహాలోనే శబరిమల ఆచారాలను కూడా గౌరవించాలని కోరింది. ఏదైనా అశాస్త్రీయ విధానం ఉంటే దాన్ని శాసనాల ద్వారా పరిష్కరించుకోవచ్చు కానీ, విశ్వాసాలకు సంబంధించిన విషయాల్లో కోర్టుల జోక్యం సరికాదని విన్నవించింది. 10 నుండి 50 ఏళ్ల వయసు గల మహిళలపై ఉన్న ఆంక్షలను కొనసాగించాలని కోరుతూ కేంద్రం తన వైఖరిని స్పష్టంగా వెల్లడించింది. సుప్రీంకోర్టు ధర్మాసనం ఈ అంశాన్ని పలు కోణాల్లో పరిశీలిస్తూ పిటిషనర్ల వాదనలను వింటోంది. దీనిపై అత్యున్నత న్యాయస్థానం ఇచ్చే నిర్ణయం దేశవ్యాప్తంగా మతపరమైన హక్కులు మరియు రాజ్యాంగ పరమైన సమానత్వంపై పెద్ద ప్రభావం చూపే అవకాశం ఉంది.

## పేదల భూములు లాక్కొంటారా..?

**మొదటిపేజీ తరువాయి..** వికారాబాద్ జిల్లా పరిగిలో భూసేకరణకు వ్యతిరేకంగా పోరాడుతున్న రైతులకు మద్దతు తెలిపేందుకు వెళ్తున్న మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీష్ రావును పోలీసులు అడ్డుకుని అరెస్ట్ చేశారు. హరీష్ రావుతో పాటు మాజీ మంత్రులు సబితా ఇంద్రా రెడ్డి, ఎర్రబెల్లి దయాకర్ రావులను అప్పా జంక్షన్ వద్ద నిలిపివేసి, అనంతరం శంషాబాద్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీరుపై హరీష్ రావు నిప్పులు చెరిగారు. పరిగిలో పేద రైతుల భూములను లాక్కుని తన సోదరుడికి కట్టబెట్టేందుకు సీఎం ప్రయత్నిస్తున్నారని ఆయన తీవ్రంగా ఆరోపించారు. రాష్ట్రంలో రేవంత్ రెడ్డి పాలన రావణ రాజ్యంగా, రాక్షస పాలనగా మారిందని, ప్రతిపక్షాలను ప్రశ్నించనివ్వకుండా అణచివేస్తున్నారని మండిపడ్డారు.

వంద రోజుల్లో అమలు చేస్తామన్న ఆరు గ్యారెంటీలు 900 రోజులైనా ఎందుకు పూర్తి చేయలేదని హరీష్ రావు నిలదీశారు. కాంగ్రెస్ ప్రభుత్వం కేవలం బోగస్ మాటలతో కాలం వెళ్లదీస్తోందని, వచ్చే ఎన్నికల్లో ఆ పార్టీకి కనీసం ప్రతిపక్ష హోదా కూడా దక్కదని జోస్యం చెప్పారు. సాగుకు పనికిరాని భూముల్లో పరిశ్రమలు పెట్టాలని సూచిస్తూ, దళిత, గిరిజన రైతులు సాగు చేసుకుంటున్న భూములను లాక్కోవడం దారుణమన్నారు. అరెస్టులు, పోలీసు నిర్బంధాలతో ఉద్యమాలను ఆపలేరని, త్వరలోనే రాష్ట్రంలో మళ్లీ కేసీఆర్ రాజ్యం, రామరాజ్యం వస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. రైతులకు భరోసా ఇవ్వడానికి వెళ్తున్న తమను లారీలను అడ్డంగా పెట్టి ఆపడం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడమేనని హరీష్ రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ అరెస్టుల నేపథ్యంలో అప్పా జంక్షన్ మరియు శంషాబాద్ పోలీస్ స్టేషన్ పరిసరాల్లో భారీగా ఉద్రిక్తత నెలకొంది.

## దేవాదాయ శాఖ కమిషనర్ శాంతి అరెస్ట్

**ఆదాయానికి మించి ఆస్తుల కేసులో ఏసిబి చర్యలు**

**విజయవాడ, ఏప్రిల్7 :** ఏపీ దేవాదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ కాళింగిరి శాంతి అరెస్టయ్యారు. ఆదాయానికి మించి ఆస్తులు ఉన్నట్లు అందిన ఫిర్యాదు మేరకు ఏసీబీ అధికారులు.. తాడేపల్లి, ఉండవల్లి సహా 4 ప్రాంతాల్లో మంగళవారం ఏకకాలంలో సోదాలు చేపట్టారు. తనిఖీల్లో భాగంగా భారీగా అక్రమ ఆస్తులను గుర్తించారు. విశాఖ ఎండాడలో లగ్జరీ ఎ÷-లాట్, తాడేపల్లి కుంచనపల్లిలో జీ ప్లస్ 2 భవనంతోపాటు 770 గ్రాముల బంగారు నగలు, 3 కిలోల వెండి గుర్తించారు. అంతేకాకుండా రూ.1.15 లక్షల నగదు, బ్యాంకు ఖాతాల్లో మరో రూ.3 లక్షలు ఉన్నట్లు తేల్చారు. వీటితోపాటు ఓ కారు, ద్విచక్ర వాహనం గుర్తించారు. అక్రమాల ఆరోపణలతో 2024 జులై నుంచి 2026 మార్చి వరకు శాంతి సస్పెన్షన్‌లో ఉన్నారు.

## ఆటోల ఎల్పీజీకి కొరత రాకూడదు

**ఎల్పీజి సరఫరా కంపెనీతో కమిషనర్ సమీక్ష**

**హైదరాబాద్,ఏప్రిల్7(ఆర్ఎన్ఎ):** ఆటో ఎల్పీజీ తెప్పించి బంకుల్లో ఎక్కడా కొరత లేకుండా చూడాలని కంపెనీలకు తెలంగాణ పౌర సరఫరాల శాఖ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర స్పష్టం చేశారు. గత వారం రోజులుగా కంపెనీలు మంచి పనితీరు కనబరిచాయని తెలిపారు. మంగళవారం హైదరాబాద్‌లో ఆటో ఎల్పీజీ సరఫరా చేసే ప్రైవేట్ మార్కెటింగ్ కంపెనీలతో కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర సమీక్షా సమావేశం నిర్వహించారు. గత వారం రోజుల్లో మొత్తం 363 మెట్రిక్ టన్నుల ఆటో ఎల్పీజీని తెప్పించి సరఫరా చేశారని వివరించారు. మూతపడిన 17 బంకులను మళ్లీ తెరిపించారని పేర్కొన్నారు. గ్యాస్ సరఫరాను పెంచి, మూతపడిన బంకులను మళ్లీ తెరిపించడంలో సూపర్ గ్యాస్ (÷ూబూ।స ఉజీబ), గో గ్యాస్ (ఉనీ ఉజీబ), టోటల్ ఎనర్జీస్ (÷నీబిజీ ఇని।సణతి।బ), ప్రైమ్ ఫ్యూయల్ (ఖసతిప। ఈబీ।) కంపెనీలు చేసిన కృషిని ఈ సందర్భంగా కమిషనర్ అభినందనలు తెలిపారు. పని తీరు ఏ మాత్రం మెరుగు పరుచుకోని పలు కంపెనీల పట్ల ఆయన తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆటో ఎల్పీజీని అధికంగా తెప్పించి, బంకులన్నింటిలో సరఫరా చేయాలని కంపెనీలకు కీలక ఆదేశాలు జారీ చేశారు. ఆటో డ్రైవర్ల ఉపాధి దెబ్బతినకుండా ఉండాలంటే ఆటో ఎల్పీజీ సరఫరా ఆగకుండా చూడాలని ఆయిల్ కంపెనీలకు పౌరసరఫరాల శాఖ కమిషనర్ స్పష్టం చేశారు. హైదరాబాద్‌లో ఆటో గ్యాస్ కొరత రాకుండా ఉండేందుకు చర్యలు చేపట్టామన్నారు. బంకులకు గ్యాస్ వస్తున్న లెక్కలను పౌరసరఫరాల శాఖ ప్రతి రోజు పర్యవేక్షిస్తుందని కమిషనర్ స్టీఫెన్ రవీందర్ వెల్లడించారు. ఏదైనా సమస్య ఉంటే హెల్ప్ లైన్ 1967కు ఫోన్ చేయాలని సూచించారు.

## చేనేతలకు ఉచిత విద్యుత్ హామీ అమలు

**చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపిన ఎమ్మెల్యే**

**అనంతపురం, ఏప్రిల్7 :** ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు చేనేతలకు ఉచిత విద్యుత్ అమలు చేసిన ఘనత సీఎం చంద్రబాబుకు దక్కుతుందని అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ అన్నారు. చేనేత కులాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఎన్జీవో హోంలో కూటమి ప్రభుత్వానికి కృతజ్ఞతగా సభలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. చేనేతల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఇందులో భాగంగానే చేనేత మగ్గాలకు 200 యూనిట్లు, మర మగ్గాలకు 500 యూనిట్లు ఉచిత విద్యుత్ అందించే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు. రాబోయే కాలంలో చేనేతల అభివృద్ధికి మరింత బాధ్యతగా పనిచేస్తామని ఎమ్మెల్యే తెలిపారు. అనంతరం ఎమ్మెల్యేను చేనేత నాయకులు సన్మానించారు.

## సొంత బంధువుల ఘాతకుం

**బంగారం కోసం వృద్ధురాలి హత్య**

**విజయనగరం, ఏప్రిల్7 :** బంగారానికి ఆశపడి సొంత బంధువులే ఓ వృద్ధురాలిని చంపి చెరువులో పాతిపెట్టిన ఘటన పోలీసుల దర్యాప్తులో వెలుగుచూసింది. మంగళవారం స్థానిక వివరాల మేరకు .. చీపురుపల్లి మండలం గొల్లపాలెం గ్రామంలో గొర్లె చిన్నప్పమ్మ (65) ను అదే గ్రామానికి చెందిన ఆమె మేనల్లుడు వరుసైన ఎజ్జుపొరపు రమణ, చందక రమణ అనే ఇద్దరు వ్యక్తులు కలిసి ఆమె బంగారానికి ఆశపడి చంపేసినట్లు స్థానికులు తెలిపారు. ఈ ఏడాది ఫిబ్రవరి 23వ తేదీన వృద్ధురాలిని గొల్లపాలెం గ్రామానికి సమీపంలో గల ఒక చెరువులో పాతిపెట్టారు. దీంతో మృతురాలి అల్లుడు రెడ్డి పాపునాయుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు ఈ కేసును ఛేదించారు. ఈ క్రమంలో స్థానిక పోలీసులతోపాటు విజయనగరం, విశాఖపట్నం నుండి ఆర్ ఎఫ్ ఎస్ ఎల్ టీంలు, క్లూస్ టీంలు డి.ఎస్.పి ఎస్ రాఘవులు, సీఐ శంకర్రావుల ఆధ్వర్యంలో సంఘటన స్థలానికి చేరుకొని అక్కడ తవ్విచూడగా వృద్ధురాలి మృతదేహం కనిపించింది. ఈ సంఘటనకు సంబంధించి ఇంకా పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. పోలీసుల దర్యాప్తు కొనసాగుతోంది.

## మణిపూర్‌లో మరోసారి ఉద్రిక్తత

**నిరసనకారులకు, పోలీసులకు మధ్య ఘర్షణ**


**ఇంఫాల్, ఏప్రిల్7 :** మణిపూర్‌లో మరోసారి ఉద్రిక్తపరిస్థితులు నెలకొన్నాయి. బిష్ణుపూర్‌జిల్లాలో నిరసనకారులకు, పోలీసులకు మధ్య ఘర్షణ చెలరేగినట్లు అధికారులు మంగళవారం తెలిపారు. ఆగ్రహించిన పోలీసులు ఆందోళనకారులపై కాల్పులకు దిగారని అన్నారు. మంగళవారం తెల్లవారుజామున మొయిరాంగ్ ట్రోంగ్లాబి ప్రాంతంలో ఒక నివాసంపై అనుమానిత వ్యక్తులు జరిపిన బాంబుదాడిలో ఐదేళ్ల బాలుడు, ఆరు నెలల చిన్నారి మరణించగా, తల్లికి తీవ్రగాయాలయ్యాయి. ఈ ఘటనపై ఆగ్రహించిన గ్రామస్తులు ఇంఫాల్ సహా పలు ప్రాంతాల్లో ఆందోళన చేపట్టారు. రహదారులను దిగ్బంధించారు.

# ఎమ్మెల్యే కోరం కనకయ్య ఆధ్వర్యంలో ఘనంగా సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

- **ఇల్లందు యూత్ కాంగ్రెస్ నాయకులు ఈసం లక్ష్మణ్ హర్షం**
- **102 కుటుంబాలకు సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ**

ఇల్లందు ఏప్రిల్ 07 (జన సంఘర్షణ)
పేద ప్రజల ఆరోగ్య భద్రతే ధ్యేయంగా ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య నియోజకవర్గంలో సంక్షేమ పాలనను పరుగులు పెట్టిస్తున్నారు. మంగళవారం స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో, ముఖ్యమంత్రి సహాయ నిధి ( సీఎంఆర్ఎఫ్ ) ద్వారా మంజూరైన భారీ నిధులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. మొత్తం 102 మంది లబ్ధిదారులకు ఎమ్మెల్యే గారు స్వయంగా చెక్కులను అందజేసి వారి కుటుంబాల్లో భరోసా నింపారు.

**యువనేత యూత్ కాంగ్రెస్ నాయకులు ఈసం లక్ష్మణ్ ప్రత్యేక చొరవ:** ఈ మొత్తం కార్యక్రమంలో ఇల్లందు నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ నాయకులు ఈసం లక్ష్మణ్ అత్యంత కీలకంగా వ్యవహరించారు. నియోజకవర్గంలోని ప్రతి పేదవాడికి, అనారోగ్యంతో బాధపడుతున్న వారికి ఎమ్మెల్యే గారి ద్వారా సహాయం అందేలా లక్ష్మణ్ నిరంతరం కృషి చేస్తున్నారు.




చెక్కుల పంపిణీ సందర్భంగా లక్ష్మణ్ మాట్లాడుతూ.. ఎమ్మెల్యే కోరం కనకయ్య పేదల కష్టాలను తన కష్టాలుగా భావించే గొప్ప నాయకుడని కొనియాడారు. "ప్రజల పక్షాన నిలబడి, వారికి రావలసిన ప్రభుత్వ ఫలాలను నేరుగా చేరవేయడంలో ఎమ్మెల్యే చూపిస్తున్న చొరవ అసాధారణం" అని లక్ష్మణ్ అభివర్ణించారు. ఎమ్మెల్యే ని అభినందిస్తూ, ఆయన ఒక పేదల పక్షపాతి అని గర్వంగా చెబుతున్నానని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్పర్సన్ దొడ్డ కిరణ్ మిత్ర డానియల్, వైస్ చైర్మన్ పెండెల రాజు, యూత్ అధ్యక్షులు లక్ష్మణ్, పట్టణ అధ్యక్షుడు దొడ్డ డానియల్, ఇతర ముఖ్య నాయకులు పాల్గొన్నారు. రాబోయే రోజుల్లో కూడా ఎమ్మెల్యే నాయకత్వంలో యువజన కాంగ్రెస్ పేదలకు అండగా ఉంటుందని లక్ష్మణ్ ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

# త్యాగాల పునాదులపై సింగరేణి సామ్రాజ్యం.. నేడు అదే కార్మికుల గూడు చెరిపేస్తారా?

- **చరిత్ర సాక్షిగా.. నాడు శ్రమ దోపిడీ, నేడు నిలువనీడ లేని వైనం!**
- **సింగరేణి తొలి కార్మిక వాడ '21 ఏరియా' నిర్వాసితుల కన్నీటి గాథ**
- **అండగా నిలిచిన సర్పంచ్ చాందావత్ రమేష్ బాబు**

ఇల్లందు ఏప్రిల్ 07 (జన సంఘర్షణ)
సింగరేణి బొగ్గు గనుల సామ్రాజ్యానికి పునాది వేసిన ప్రాంతం అది. తట్టెడు బొగ్గు కోసం ప్రాణాలను పణంగా పెట్టి, చీకటి గనుల్లో రక్తాన్ని ధారపోసిన కార్మికుల తొలి నివాస కేంద్రం ఆ '21 ఏరియా'. కానీ, నేడు అదే సింగరేణి యాజమాన్యం తమ అవసరాల కోసం ఆ చరిత్రను చెరిపేయాలని చూస్తోంది. తరతరాలుగా అక్కడ గూడు కట్టుకున్న వేలాది కుటుంబాలను "వారం రోజుల్లో ఖాళీ చేయాలి" అంటూ హుకుం జారీ చేయడం ఇప్పుడు ఇల్లందులో పెను సంచలనంగా మారింది.

**అరచేతిలో వైకుంఠం.. ఆపై మాట మార్పు!**

జేకే-5 ఓపెన్ కాస్ట్ (రాజ) విస్తరణ పేరుతో సింగరేణి అధికారులు వేసిన ఎత్తుగడలు ఇప్పుడు ఒక్కొక్కటిగా బయటపడుతున్నాయి. ఓసీ ఏర్పాటు ప్రక్రియ ప్రారంభంలో, పబ్లిక్ హియరింగ్ సమయంలో నిర్వాసితులకు మెరుగైన ప్యాకేజీ, ఇంటి స్థలం, పునరావాస కాలనీలో సకల సౌకర్యాలు కల్పిస్తామని నమ్మబలికారు. కానీ, తీరా పని ముగిశాక ఇప్పుడు మాట మారుస్తున్నారు. "ఇది సింగరేణి లీజు భూమి, ఇక్కడ నివసించే వారికి పరిహారం ఇచ్చే ప్రసక్తే లేదు" అని అధికారులు భీష్మించుకు కూర్చోవడం నిర్వాసితుల గుండెల్లో రైళ్లు పరుగెత్తిస్తోంది. కనీసం ఇల్లు కట్టుకోవడానికి స్థలం కూడా ఇవ్వమని చెప్పడం యాజమాన్యం యొక్క కర్కశత్వానికి పరాకాష్ట.

**నిర్వాసితుల గళమై.. సర్పంచ్ రమేష్ బాబు గర్జన!**

ఈ క్లిష్ట సమయంలో బాధితుల పక్షాన కొండంత అండగా నిలిచారు. విజయలక్ష్మి నగర్ సర్పంచ్ చాందావత్ రమేష్ బాబు. అధికారుల నోటీసులతో బెంబేలెత్తిపోతున్న సామాన్య ప్రజలకు ధైర్యాన్ని ఇస్తూ, సింగరేణి మొండి వైఖరిపై ఆయన పోరాట బావుటా ఎగురవేశారు. న్యాయం జరిగే వరకు విశ్రమించేది లేదు! "సింగరేణి సంస్థ అంటే కేవలం యంత్రాలు, బొగ్గు కాదు.. అది లక్షలాది మంది కార్మికుల జీవితం. అటువంటి సంస్థే తన బిడ్డలను అనాథలను చేయడం సిగ్గుచేటు" అని రమేష్ బాబు ఆవేదన వ్యక్తం చేశారు. ఖాళీ చేయాలంటూ పంచాయతీ కార్యాలయాలకే నోటీసులు ఇవ్వడం అంటే ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేయడమేనని ఆయన మండిపడ్డారు. బాధితులకు మెరుగైన పునరావాసం కల్పించే వరకు, కొత్త ఇళ్లు నిర్మించుకునే వరకు వారిని కదిలించే ప్రసక్తే లేదని, అవసరమైతే ఇల్లందు గడ్డపై మరో మహా ఉద్యమానికి శ్రీకారం చుడతామని ఆయన హెచ్చరించారు.






**రమేష్ బాబు డిమాండ్లు ఇవే:**


తక్షణ వసతి: నిర్వాసితులకు కొత్త ఇళ్లు పూర్తయ్యే వరకు ప్రత్యామ్నాయ అకామిడేషన్ కల్పించాలి.
హక్కు పత్రాలు: ఆర్ అండ్ ఆర్ కాలనీల్లో మౌలిక సదుపాయాలు కల్పించడంతో పాటు, ప్రతి కుటుంబానికి రెవెన్యూ పట్టాలు అందజేయాలి.
దత్తత తీసుకోవాలి: నిర్వాసితుల సంక్షేమం కోసం విజయలక్ష్మి నగర్, తిలక్ నగర్ గ్రామ పంచాయతీలను సింగరేణి దత్తత తీసుకోవాలి.
విద్యుత్ ఉపశమనం: ప్రైవేట్ విద్యుత్ కనెక్షన్ల భారం తగ్గించి, తక్షణమే ప్రభుత్వ విద్యుత్ సరఫరాను పునరుద్ధరించాలి.
"ముత్తాతల కాలం నుండి ఈ గడ్డపై చెమట చిందించి, సింగరేణిని మహావృక్షం చేసిన కుటుంబాలకు కనీస నోటీసులు ఇవ్వకుండా ఖాళీ చేయమనడం అమానుషం. ఇది కేవలం భూమి సమస్య కాదు, వేల కుటుంబాల ఆత్మగౌరవ సమస్య. న్యాయం జరిగే వరకు సింగరేణి గేట్ల ముందు ధర్నాకైనా సిద్ధమే!" అని రమేష్ బాబు హెచ్చరించారు.

**ప్రశ్నార్థకంగా 21 ఏరియా భవితవ్యం!**

చరిత్ర కలిగిన విజయలక్ష్మి నగర్, తిలక్ నగర్ పంచాయతీ కార్యాలయాలను సైతం ఖాళీ చేయాలని నోటీసులు ఇవ్వడం చూస్తుంటే, సింగరేణి యాజమాన్యం ఎంతటి కఠిన నిర్ణయానికి వచ్చిందో అర్థమవుతోంది. ప్రజాప్రతినిధులు వినతి పత్రాలు ఇవ్వడానికి వెళ్లినా, ఏరియా జీఎం మొండిగా సమాధానం చెప్పడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అభివృద్ధి పేరుతో సంపదను వెలికితీస్తున్న సంస్థ, ఆ సంపద కోసం సర్వస్వాన్ని ధారపోసిన కార్మిక బిడ్డలను రోడ్డున పడేయడం సమంజసమేనా? 30 ఏళ్ల క్రితం ప్రాణాలకు తెగించి పోరాడి తమ ఇళ్లను కాపాడుకున్న 21 ఏరియా వాసులు, నేడు రమేష్ బాబు నాయకత్వంలో మరో మలిదశ ఉద్యమానికి సిద్ధమవుతున్నారు. ఈ పోరాటంలో గెలుపు ఎవరిది? సింగరేణి అధికార దర్పానిదా లేక బాధితుల అన్నది వేచి చూడాలి.

# మాజీ మంత్రి హరీశ్ రావు హౌస్ అరెస్ట్

హైదరాబాద్ /ఏప్రిల్ 7/(జన సంఘర్షణ)
మాజీ మంత్రి హరీశ్ రావును పోలీసులు హౌస్ అరెస్ట్ చేశారు. ఆయన పరిగిలో ఇండస్ట్రియల్ పార్క్ భూసేకరణపై బాధిత రైతులను కలిసేందుకు వెళ్లడాన్ని అడ్డుకున్నారు. ఈ మేరకు హరీశ్ రావు నివాసం వద్ద భారీ పోలీస్ బలగాలు మోహరించారు. అలాగే మాజీ మంత్రి సబితతో పాటు రంగారెడ్డి, వికారాబాద్ జిల్లాల పలువురు బీఆర్ఎస్ నేతలను కూడా గృహ నిర్బంధం చేశారు. భూములు కోల్పోతున్న రైతుల ఆవేదనను వినేందుకు వెళ్తున్న ప్రతిపక్ష నేతలను పోలీసులు అడ్డుకోవడం దుర్మార్గమని హరీశ్ రావు విమర్శించారు.



# జల్లపలల్లి (వి) గ్రామంలో అంబేద్కర్ విగ్రహానికి భూమి పూజ

పోతంగల్ జిల్లపల్లి/ఏప్రిల్ 7/(జన సంఘర్షణ)
నిజామబాద్ జిల్లా పోతంగల్ మండలంలోని, జిల్లపల్లి (వి) గ్రామంలో మంగళవారం డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహ ప్రతిష్టాపనకు భూమి పూజ కార్యక్రమం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సుంకు లతా రవీందర్, ఉప సర్పంచ్ ఎం డి సికిందర్, వార్డు మెంబర్లు నాగమణి, సురేష్, లక్ష్మీ బాయ్, ఎస్సీ ఎస్టీ హక్కుల పరిరక్షణ కమిటీ బోధన్ డివిజన్ ఎన్ ఈశ్వర్, డివిజన్ కో కన్వీనర్ నీరడి రవి, రిటైర్డ్ హెడ్మాస్టర్ మేత్రి నాగయ్య, ఎం.ఆర్.పి.ఎస్ అధ్యక్షుడు కామారెడ్డి జిల్లా రుశేగాం భూమయ్య, ఎం ఆర్ పి ఎస్ మండల కార్యదర్శి, రేణి రాములు, సుంకు సుభాష్, నరసయ్య, లాలయ్య , సత్యనారాయణ, మారుతి, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.



# గార్లలో పోలీసు చర్యపై మాజీ ఎమ్మెల్యే భానోతు హరిప్రియ హరిసింగ్ నాయక్ ఖండన

ఇల్లెందు ప్రతినిధి ఏప్రిల్ 07, 2026: (జన సంఘర్షణ)
మున్నేరు-పాలేరు లింక్ కెనాల్ సర్వే పనుల నేపథ్యంలో భద్రాద్రి జిల్లా అధికార యంత్రాంగం గార్లలో చేపట్టిన పోలీసు చర్యను ఇల్లందు నియోజకవర్గ మాజీ శాసనసభ్యురాలు, బీఆర్ఎస్ పార్టీ ఇంచార్జి భానోతు హరిప్రియ హరిసింగ్ నాయక్ తీవ్రంగా ఖండించారు. మంగళవారం తెల్లవారుజామునే వందలాది మంది పోలీసులను మోహరించి, యుద్ధ వాతావరణాన్ని సృష్టిస్తూ సర్వే పనులు నిర్వహించడం అనవసరమని ఆమె అభిప్రాయపడ్డారు. స్థానిక ప్రజల మనోభావాలను పరిగణనలోకి తీసుకోకుండా, లింక్ కెనాల్‌కు వ్యతిరేకంగా ఉద్యమిస్తున్న అఖిలపక్ష నాయకులను అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌లో నిర్బంధించడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని పేర్కొన్నారు. అరెస్టు చేసిన అఖిలపక్ష నాయకులను తక్షణమే విడుదల చేయాలని, స్థానికుల అభిప్రాయం మేరకు లింక్ కెనాల్ సర్వే పనులను వెంటనే నిలిపివేయాలని ఆమె డిమాండ్ చేశారు. ప్రజల అభిప్రాయాలను పక్కనపెట్టి రాష్ట్ర ప్రభుత్వం ఏకపక్షంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. గత కొద్ది రోజులుగా "లింక్ కెనాల్ వద్దు - మున్నేరు ప్రాజెక్టే ముద్దు" అనే నినాదంతో గార్లలో అన్ని రాజకీయ పక్షాలు మున్నేరు జలసాధన కమిటీ పేరిట అఖిలపక్షంగా ఉద్యమం కొనసాగిస్తున్నాయని, అయినప్పటికీ ప్రభుత్వం వాటిని పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఇలాంటి ఉద్రిక్త పరిస్థితులను నివారించాలంటే వెంటనే సర్వే పనులను నిలిపివేసి, అరెస్టు చేసిన నాయకులను విడుదల చేసి, ప్రశాంత వాతావరణం నెలకొల్పాలని హరిప్రియ హరిసింగ్ నాయక్ కోరారు.



# ఇల్లందులో సిఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

ఇల్లందు, ఏప్రిల్ 7:( జన సంఘర్షణ)
ఇల్లందు నియోజకవర్గంలో సిఎంఆర్ఎఫ్ (ముఖ్యమంత్రి సహాయ నిధి) చెక్కుల పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. గౌరవ శాసనసభ్యులు కోరం కనకయ్య లబ్ధిదారులకు చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఇల్లందు మండలం మున్సిపాలిటీ పరిధిలోని అర్హులైన వారికి చెక్కులు పంపిణీ చేయగా, మండలంలో 76 మంది, మున్సిపాలిటీ పరిధిలో 26 మంది లబ్ధిదారులు సహాయం పొందారు. మొత్తం 102 మందికి సిఎంఆర్ఎఫ్ నిధులు అందాయి. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్పర్సన్ దొడ్డ కిరణ్ మిత్ర డానియల్, వైస్ చైర్మన్ పెండెల రాజు, పట్టణ అధ్యక్షుడు దొడ్డ డానియల్, ప్రధాన కార్యదర్శి మహమ్మద్ జాఫర్, మార్కెట్ కమిటీ చైర్మన్ బానోత్ రాంబాబు నాయక్, వైస్ ఎంపీపీ మండల రాము పాల్గొన్నారు. అలాగే సీనియర్ నాయకులు మడుగు సాంబమూర్తి, బోళ్ల సూర్యం, మున్సిపల్ వార్డ్ కౌన్సిలర్లు, సర్పంచులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ..అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సహాయం అందేలా కృషి చేస్తున్నామని, అవసరమైన వారికి సిఎంఆర్ఎఫ్ ద్వారా మద్దతు కొనసాగుతుందని తెలిపారు.



# అల్లు అర్జున్ జన్మదినం సందర్భంగా రక్తదాన శిబిరాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే కోరం కనకయ్య

ఇల్లెందు ప్రతినిధి (జన సంఘర్షణ )
ఇల్లందు పట్టణంలో ప్రముఖ సినీ నటుడు అల్లు అర్జున్ జన్మదినాన్ని పురస్కరించుకుని అభిమానులు సేవా కార్యక్రమాలతో వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా 16వ వార్డులో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. అభిమానుల ఆహ్వానం మేరకు కార్యక్రమానికి విచ్చేసిన ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రజలకు ఉపయోగపడే రక్తదాన శిబిరాన్ని అల్లు అర్జున్ అభిమానులు నిర్వహించడం అభినందనీయమని పేర్కొన్నారు. అత్యవసర సమయాల్లో రక్తదానం ఎంతోమందికి ప్రాణాధారంగా నిలుస్తుందని, ఇలాంటి సేవా కార్యక్రమాలు సమాజానికి ఎంతో మేలు చేస్తాయని అన్నారు. అలాగే తెలుగు చలనచిత్ర పరిశ్రమలో విశేష గుర్తింపు పొందిన అల్లు అర్జున్‌కు హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అభిమానులు తమ అభిమాన నటుడు పేరుతో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టి సమాజానికి దోహదపడాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఇల్లందు మార్కెట్ కమిటీ చైర్మన్ బానోత్ రాంబాబు, మున్సిపాలిటీ వైస్ చైర్మన్ పెండెల రాజు, మాజీ వైస్ ఎంపీపీ మండల రాంమహేష్, 16వ వార్డు నాయకులు ఉల్లింగ సతీష్, దండుగుల శివ, బండి ఆనంద్, అల్లు అర్జున్ అభిమానులు తదితరులు పాల్గొన్నారు.




# మండలంలో పలు కార్యక్రమాలను పరిశీలించిన మండల ప్రత్యేక అధికారి

బీబీపేట్ ఏప్రిల్ 07. ( జన సంఘర్షణ)
బీబీపేట్ మండలం లో మండల ప్రత్యేక అధికారి శ్రీనివాస్ ఉపాధి హామీ ఫార్మేషన్ రోడ్డు యాడారం శివరాం రెడ్డి పల్లిలో ఇందిరమ్మ ఇల్లు, నూతనంగా నిర్మించ బోతున్న గ్రామపంచాయతీ భవనం జడ్పిహెచ్ఎస్ యాడారం పరిశీలించడం జరిగింది. బీబీపేట్ ప్రాథమిక హాస్పిటల్‌లో ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా డాక్టర్ ఏఎన్ఎం ఆశా వర్కర్స్ కు అవగాహన కల్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో పూర్ణ చంద్రోదయ కుమార్, ఏపీవో రజిని, నారాయణరెడ్డి ఫీల్డ్ అసిస్టెంట్ అధికారులు పాల్గొన్నారు.






## ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతికి చట్ట భద్రత సాధించిన ముఖ్యమంత్రి చంద్రబాబుకు ధన్యవాదములు...

**❑ టీటీడిపి జాతీయ ప్రచారకార్యదర్శి జె. దశరథ్**

హైదరాబాద్ సిటిబ్యూరో /ఏప్రిల్ 7( జనసంఘర్షణ )
తొలిగి పోయిన తెలుగు రాష్టం ఆంధ్ర ప్రదేశ్ లో నీ అమరావతికి అడ్డంకులు తెలుగు రాష్టం విభాజిత ఆంధ్రప్రదేశ్ గత 12.సంవత్సరాలుగుగా ఎన్నో రకాల అడంకులు సృష్టించి శ్రీకృష్ణ కమిటీ కి గతంలోనే ఆంధ్ర ప్రదేశ్ లో లోటు బడ్జెట్.తో ఏర్పాటైన గతం లోని కేంద్రంలోని మన్మోహన్ సింగ్ నాటి ప్రధానమంత్రి గా ఉన్న సమయంలో హేతుబద్ధ ముగా .కేంద్రం, తెలుగు రాష్ట్రాల ను విభజించి ఒక్కో స్థాయిలో హేతుబద్ధంగా రస్ట్ విభజన జరిగింది. తద్వారా తెలుగు రాష్టం విభాజిత తరవాత 2014.తొలి ముఖ్యమంత్రిగా పనిచేసిన తెలుగుదేశం పార్టీ అధినేత ఆనాటి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు విభాజిత ఆంధ్రప్రదేశ్ కు సి ఎమ్ గా బాధ్యతలు చేపట్టిన ఆనాటి కాంగ్రెస్ ప్రభుత్వం కొన్ని చట్టం చేయడంలో ఆలస్యంగా ఎన్నో చట్టపరమైన అనేక రాష్ట ప్రభుత్వ యంత్రాగం లోటు బడ్జెట్ ఉన్న రాష్ట్రన్ని చంద్ర బాబు నాయుడు ఆనాడు సీఆర్డీఏ దాని ఏర్పాట్టు చేసీ తద్వారా లాండ్ పూలింగ్ ద్వారా కొన్ని వేల ఎకరాల భూమిని సేకరించి అమరావతిలో పలు అభివృద్ధి పనులను పూర్తి చేయగా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం హయాంలో ఎన్నో కొన్ని నిధులు మంజూరు చేయించి ఆప్రాంతంలో పోలవరానికి సంబంధించిన వేల కోట్ల రూపాయల ను ఖర్చు చేసి అంతలో 2019.లో మళ్ళీ ఎన్నికలు రావడం రాష్ట్రంలో ఎన్నికల ముఖ చిత్రం మారడం ముఖ్యమంత్రి గా విభాజిత ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో జగన్ మోహన్ రెడ్డి ప్రమాణం చేసి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో అనేకఅంశాలపై ప్రభుత్వం మారడం ద్వారా రాష్ట్ర లో అనేక ఇబ్బందులుపడి 5.సంవత్సరాలు కుంటు పడి కనీసం కేంద్రంలో 16.ఎంపీ లు కలిగిఉన్న జగన్ మోహన్ రెడ్డిగారు రాష్ట ఏ మిన్ మేట్ తీసు రావడంలో ఆ 16.మంది ఎంపీలు కాలయాపన చేసి ముఖ్యమంత్రిగా ఉన్న జగన్ మోహన్ రెడ్డి గారు ఆ ఆలోచనను కూడా పాలన పెట్టారని కేవలం 3.రాజధానులని ఆయన కాలయాపన చేశారనడానికి మచ్చుతునక ఆయనకు రాజకీయ అవగాహన.లేదనడానికి నిదర్శనం రాష్ట ఎమ్ ఎన్ మేట్ తీసుకు రావడంలో ఆయన విఫలం చెందారని ఈసందర్భంగా దశరథ్ స్పష్టం చేశారు ఆంధ్ర ప్రదేశ్ కి ముఖ్యమంత్రి గా పనిచేసిన ఆయనకు మొదటి కేంద్రంలో ప్రత్యేక రాష్ట్రం నికి ఎమ్ ఎన్ మేట్ చేసి సాధించుకోవాలిసింది జగన్ మోహన్ రెడ్డి.కాదా.. అధిమరచి 3 రాజధానులు అని .కాలయాపన చేశారనడానికి మచ్చుతునక . రస్ట్ రీఆర్గనేషన్ చట్టం వచ్చినతరువాత ప్రభుత్వం అధినేతగా ముఖ్యమంత్రి ఇష్టానుసారంగా జగన్ మోహన్ రెడ్డి అప్పుడు 3 .రాజధానుల విషయాని తెరపైకి తీసుకు రావాలి కానీ అది మరచిన ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి రాజకీయాలకు అనర్హుడుగా ఉందన్నారు. ఎటాకేలా కు రాష్ట తెలుగు రాష్టం ఆంధ్ర ప్రదేశ్ కు రాష్ట పతి ఆమోదం హర్షించ దగ్గ విషయం అంత చంద్రబాబు నాయుడు, పోరాటం చేసిన 2.సంవత్సరాలు పోరాట పట్టిమను ఉన్న ప్రతి వారిది ఈవిజయం అపూర్వ విజయం తెలంగాణ తెలుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి జె. దశరథ్ అన్నారు.






# సింగరేణి యాజమాన్యంపై ఆగ్రహం

**❑ 21 ఏరియా ప్రజలకు న్యాయం వరకు పోరాటం కొనసాగిస్తాం: సర్పంచులు, అఖిలపక్ష నేతలు**

ఇల్లెందు ప్రతినిధి :(జన సంఘర్షణ)
సింగరేణి మండలంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. విజయలక్ష్మి నగర్, తిలక్ నగర్ గ్రామపంచాయతీల పరిధిలోని ఓసీ నిర్వాసిత ప్రాంతాన్ని ఖాళీ చేయాలని సింగరేణి అధికారులు సూచించడంతో స్థానిక ప్రజల్లో తీవ్ర భయాందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో విజయలక్ష్మి నగర్ సర్పంచ్ చాందావత్ రమేష్ బాబు, తిలక్ నగర్ సర్పంచ్ ధనసరి స్రవంతి, అఖిలపక్ష నాయకులు కలిసి నూతన ఎమ్మార్వోను మర్యాదపూర్వకంగా కలుసుకుని వినతిపత్రం సమర్పించారు. గ్రామ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు, గతం నుండి కొనసాగుతున్న పరిస్థితులను వారు వివరంగా తెలియజేశారు. సింగరేణి యాజమాన్యం ఎలాంటి ముందస్తు సమాచారం ఇవ్వకుండా, ప్రజలతో చర్చించకుండా ఇళ్లను ఖాళీ చేయాలని ఒత్తిడి తేవడం సరైన విధానం కాదని నేతలు తీవ్రంగా అభ్యంతరం వ్యక్తం చేశారు. ప్రభుత్వం అనుమతి, ప్రజలతో సంపూర్ణ చర్చల అనంతరం మాత్రమే నిర్ణయాలు తీసుకోవాలని వారు స్పష్టం చేశారు. ప్రజలకు న్యాయం జరిగే వరకు తాము వెనక్కి తగ్గబోమని, అవసరమైతే ఆందోళనలు చేపట్టడానికి సిద్ధంగా ఉన్నామని హెచ్చరించారు. భవిష్యత్తులో ఎలాంటి పరిణామాలు జరిగినా వాటికి సింగరేణి యాజమాన్యమే పూర్తి బాధ్యత వహించాల్సి ఉంటుందని తెలిపారు. అదేవిధంగా, ఈ అంశంపై జిల్లా కలెక్టర్‌కు సమగ్ర నివేదిక అందించి, పూర్తి స్థాయి విచారణ జరపాలని ఎమ్మార్వోను కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ పూనెం సురేందర్, అబ్దుల్ నభి, మంచాల వెంకటేశ్వర్లు, తాండ్ర నాగరాజు, క్లింట్ రోచ్, తేజవత్ లాలు, ఎట్టి హరికృష్ణ, వడ్ల శ్రీను, ధనసరి రాజు, బానోత్ హరిసింగ్, గాడేపల్లి భాస్కర్, సదారం చిన్నారి, మొగిలి, రాజు తదితరులు పాల్గొన్నారు.



# ప్రధానమంత్రి 'నేషనల్ అప్రెంటిస్‌షిప్ మేళా'


**❑ నైపుణ్యానికి పదును.. ఉపాధికి బాట**

కొత్తగూడెం ఏప్రిల్ 07 (జన సంఘర్షణ)
పారిశ్రామిక హబ్‌గా వెలుగొందుతున్న భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో సాంకేతిక విద్యను అభ్యసించిన యువతకు ఉజ్వల భవిష్యత్తును అందించే దిశగా ప్రభుత్వ ఐటీఐ వేదిక కానుంది. ఈ నెల 13వ తేదీ సోమవారం ఉదయం 10:00 గంటలకు కొత్తగూడెం ప్రభుత్వ ఐటీఐ ప్రాంగణంలో నిర్వహించనున్న 'ప్రధానమంత్రి జాతీయ అప్రెంటిస్‌షిప్ మేళా' కేవలం ఒక రిక్రూట్‌మెంట్ డ్రైవ్ మాత్రమే కాదు, నిరుద్యోగ యువత కలలకు ఒక ప్రాచీన వారధి వంటిది. ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐలలో వివిధ ట్రేడ్‌లలో ఉత్తీర్ణత సాధించి, సరైన అవకాశం కోసం ఎదురుచూస్తున్న అభ్యర్థులకు ఇదొక సువర్ణావకాశమని జిల్లా నోడల్ అధికారి జి. రమేష్ స్పష్టం చేశారు. అభ్యర్థులు ముందుగా తమ పేర్లను అధికారిక పోర్టల్‌లో నమోదు చేసుకోవాలని, మేళాకు హాజరయ్యే సమయంలో ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ కాపీతో పాటు అప్‌డేట్ చేసిన బయోడేటా, ఒరిజినల్ సర్టిఫికెట్లను వెంట తీసుకురావాలని అధికారులు సూచిస్తున్నారు. నేటి పోటీ ప్రపంచంలో కేవలం డిగ్రీలు మాత్రమే సరిపోవని, పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా ప్రత్యక్ష పని అనుభవం ఉంటేనే స్థిరమైన ఉపాధి లభిస్తుందన్న సత్యాన్ని ఈ మేళా గుర్తుచేస్తోంది. వివిధ ప్రముఖ పరిశ్రమలలో శిక్షణ పొంది, వృత్తిపరమైన నైపుణ్యాలను మెరుగుపరుచుకోవడం ద్వారా యువత తమ ఉపాధి దిశగా బలమైన అడుగులు వేయాలని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునివ్వడం జిల్లాలోని నిరుద్యోగుల్లో కొత్త ఆశలను చిగురింపజేస్తోంది.



# నిఘా నీడలో రహదారులు!

ఇల్లందు ఏప్రిల్ 07 (జన సంఘర్షణ)
శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా ఇల్లందు పోలీసులు క్షేత్రస్థాయిలో తనిఖీలను ముమ్మరం చేశారు. మంగళవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల సమీపంలో ఎస్సై సారంగపాణి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ విస్తృత తనిఖీలు వాహనదారులకు ఒక గట్టి హెచ్చరికను పంపాయి. కేవలం జరిమానాల విధింపే లక్ష్యంగా కాకుండా, రోడ్డు భద్రత పట్ల బాధ్యతారాహిత్యాన్ని విడనాడాలని, ప్రతి వాహనదారుడు తప్పనిసరిగా ధ్రువపత్రాలు కలిగి ఉండాలని ఈ సందర్భంగా పోలీసులు స్పష్టం చేశారు. అయితే, పోలీసుల తనిఖీలు కేవలం ఒక యాంత్రిక ప్రక్రియగా మిగిలిపోకుండా, సమాజంలో నేరాల నియంత్రణకు పౌరుల సహకారం ఎంత అవసరమో ఈ చర్యలు గుర్తుచేస్తున్నాయి. "అనుమానం వస్తే సమాచారం ఇవ్వండి" అనే పిలుపు వెనుక, నేరరహిత సమాజ స్థాపనలో ప్రతి సామాన్యుడు ఒక 'అప్రమత్త పహారా' కావాలనే ఉద్దేశ్యం కనిపిస్తోంది. పత్రాల తనిఖీ అనేది భద్రతకు తొలి మెట్టు మాత్రమేనని, అసలైన రక్షణ అప్రమత్తతలో నే ఉందని ఈ సంఘటన ఇల్లందు వాసులను ఆలోచింపజేస్తోంది.



# పోలీసులను ఆశ్రయించిన ప్రేమ జంట

**❑ పోలీస్ స్టేషన్లో ప్రేమ జంట పూలదండలు మార్చుకున్నారు**

బోధన్ : ఏప్రిల్ 07 జన సంఘర్షణ
బోధన్ మండలంలోని ఊట్ పల్లి గ్రామం లోని భట్టు రాజేష్ అబ్బాయి అలాగే కొడిమ్యాల మండలం నాచు పల్లి గ్రామానికి చెందిన అమ్మాయి ఆక్సీత అను ఇద్దరు మేజర్ కావడంతో ఇరువురి ఇష్టాపూర్వకంగా ప్రేమ వివాహం చేసుకున్నారు. అయితే విషయంలో జంట రెండు కుటుంబాల నుండి రక్షణ కొరకు బోధన్ రూరల్ పోలీస్ స్టేషన్ ను ఆశ్రయించారు. వివాహ భద్రత కోసం పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు.



# మురికి వీడి.. వెలుగు దిశగా!

ఇల్లందు ఏప్రిల్ 07 (జన సంఘర్షణ)
అభివృద్ధి అంటే కేవలం కాంక్రీటు కట్టడాలు మాత్రమే కాదు, పరిసరాల పరిశుభ్రత కూడా అని చాటిచెబుతున్నారు విజయలక్ష్మి నగర్ సర్పంచ్ చాందావత్ రమేష్ బాబు. గ్రామ పంచాయతీ పరిధిలోని ప్రధాన రహదారులకు ఇరువైపులా ఏపుగా పెరిగిన పిచ్చి మొక్కలు, పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని తొలగించే కార్యక్రమాన్ని ఆయన స్వయంగా పర్యవేక్షిస్తున్నారు. పంచాయతీ సిబ్బందితో కలిసి యుద్ధ ప్రాతిపదికన చేపట్టిన ఈ పారిశుధ్య డ్రైవ్ వల్ల రోడ్లు ఇప్పుడు అద్దంలా మెరుస్తూ, ప్రయాణికులకు ప్రమాద భయం లేకుండా స్పష్టమైన బాటను చూపుతున్నాయి. "మన ఊరు-మన బాధ్యత" అనే నినాదాన్ని చేతల్లో చూపిస్తూ, పచ్చని చెట్లు ఉండాలి కానీ పిచ్చి మొక్కలు కాదనే అవగాహనను ఈ కార్యక్రమం ప్రజల్లో కలిగిస్తోంది. కేవలం అధికారుల మీదే ఆధారపడకుండా, ప్రతి పౌరుడు తన ఇంటి పరిసరాన్ని శుభ్రంగా ఉంచుకుంటేనే ఆరోగ్యకరమైన సమాజం సాధ్యమవుతుందని ఈ సందర్భంగా సర్పంచ్ పిలుపునిచ్చారు. పరిశుభ్రత పట్టని చోట ప్రగతి అడుగులు పడవు అనే సత్యాన్ని ఈ పారిశుధ్య పనులు గుర్తుచేస్తున్నాయి.



# సౌర శక్తి.. సామాన్యుడి ప్రగతి!

భద్రాద్రి కొత్తగూడెం ఏప్రిల్ 07 (జన సంఘర్షణ)
పెరుగుతున్న విద్యుత్ వినియోగం, మారుతున్న కాలానికి అనుగుణంగా సామాన్యుడిపై ఆర్థిక భారం తగ్గడమే కాకుండా, పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఇల్లు భాగస్వామ్యం కావాలనే లక్ష్యంతో 'పీఎం సూర్యఘర్ ముక్తి బిజిలీ యోజన' పథకాన్ని ప్రభుత్వం ప్రవేశపెట్టింది. ఈ పథకాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు భద్రాద్రి జిల్లా కలెక్టర్ అంకిత్ ప్రత్యేక చొరవ చూపుతూ, దరఖాస్తు ప్రక్రియపై స్పష్టతనిచ్చారు. కేవలం ఆధార్, విద్యుత్ బిల్లు, బ్యాంక్ పాస్ బుక్ వంటి ప్రాథమిక పత్రాలతో అధికారిక వెబ్‌సైట్ ద్వారా నమోదు చేసుకుంటే, సూర్యరశ్మితో ఇంటి వెలుగులు నింపుకోవచ్చని ఆయన సూచించారు. అయితే, ఈ పథకం కేవలం రాయితీలు లేదా ఉచిత విద్యుత్ గురించి మాత్రమే కాదు; సంప్రదాయేతర ఇంధన వనరుల వైపు మళ్లడం ద్వారా భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన పర్యావరణాన్ని అందించే ఒక సామాజిక బాధ్యత కూడా. "నేడు మనం చేసే పొదుపు.. రేపటి తరానికి మనం ఇచ్చే ఆస్తి" అనే కోణంలో ఈ పథకాన్ని కేవలం ఒక ప్రభుత్వ అవకాశంగా కాకుండా, ప్రతి పౌరుడు తన ఇంటి నుంచే ప్రారంభించాల్సిన ఇంధన విప్లవంగా గుర్తించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



# దక్షిణ అయోధ్యలో లోక కల్యాణం

**❑ భద్రగిరిపై కనులపండువగా సీతారాముల పరిణయం**

భద్రాచలం ఏప్రిల్ 07 (జన సంఘర్షణ)
భారతీయ ఆధ్యాత్మిక చరిత్రలో తనకంటూ ఒక ప్రత్యేక పుటను లిఖించుకున్న భద్రాచల పుణ్యక్షేత్రం, మంగళవారం నాడు మరోమారు భక్తి పారవశ్యంతో పులకించిపోయింది. త్రేతాయుగపు ధర్మమూర్తి, మర్యాదా పురుషోత్తముడైన శ్రీ సీతారామచంద్ర స్వామివారి 'నిత్య కళ్యాణ' వేడుక బేడా మండపంలో అత్యంత వైభవంగా, శాస్త్రోక్తంగా నిర్వహించబడింది. తెల్లవారుజామునే సుప్రభాత సేవతో మేల్కొన్న స్వామివారికి నిర్వహించిన అభిషేక, అర్చనలు భక్తుల హృదయాల్లో ఆధ్యాత్మిక వెలుగులను నింపాయి. అయితే, ఈ క్షేత్ర విశిష్టత కేవలం ఈ వేడుకలకే పరిమితం కాదు; గోదావరి నది తీరాన భక్త రామదాసు నిర్మించిన ఈ ఆలయం, ధర్మానికి, నిస్వార్థ భక్తికి ఒక సజీవ సాక్ష్యం. ఎక్కడో ఉత్తరాన ఉన్న అయోధ్యకు ఈ 'దక్షిణ అయోధ్య' వారధిగా నిలుస్తూ, భరతఖండపు సాంస్కృతిక ఐక్యతను చాటిచెబుతోంది. లోక కల్యాణార్థం జరిగిన ఈ క్రతువు, నేటి విచ్ఛిన్నమవుతున్న మానవ సంబంధాల మధ్య ఆదర్శ దంపతులైన సీతారాముల అనురాగాన్ని, సామాజిక బాధ్యతను మనకు గుర్తుచేస్తోంది. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అధికారులు చేసిన ఏర్పాట్ల నడుమ, వేద మంత్రాల సాక్షిగా జరిగిన ఈ పరిణయ ఘట్టం, కేవలం ఒక ఆచారం మాత్రమే కాదు, అది లోక శాంతికి ఒక దివ్య సంకేతం.



## గార్లలో పోలీస్ 'నిర్బంధం'.. ప్రజాస్వామ్యమా? యుద్ధమా?


**❑ గళమెత్తిన పుణ్య నాయక్**

గార్ల ఏప్రిల్ 07 (జన సంఘర్షణ)
భద్రాద్రి జిల్లా గార్ల మండలంలో మంగళవారం తెల్లవారుజామునే నెలకొన్న ఉద్రిక్త పరిస్థితులు అప్రకటిత అత్యవసర స్థితిని తలపిస్తున్నాయి. మున్నేరు-పాలేరు లింక్ కెనాల్ సర్వే పనుల పేరుతో ప్రభుత్వం వందలాది మంది పోలీసులను మోహరించి, యుద్ధ వాతావరణం సృష్టించడాన్ని సామాజిక నాయకులు బోడ పుణ్య నాయక్ తీవ్రంగా ఖండించారు. ప్రజల మనోభావాలకు విరుద్ధంగా, నిర్బంధాల మధ్య సర్వే పనులు నిర్వహించడం ప్రభుత్వ అహంకారానికి నిదర్శనమని ఆయన ధ్వజమెత్తారు. "మున్నేరు జలసాధన కమిటీ" ఆధ్వర్యంలో గత కొన్ని రోజులుగా శాంతియుతంగా ఉద్యమిస్తున్న అఖిలపక్ష నాయకులను తెల్లవారుజామునే అరెస్టు చేసి పోలీస్ స్టేషన్లలో నిర్బంధించడాన్ని ఆయన తీవ్రంగా వ్యతిరేకిస్తూ, వారిని తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. "లింక్ కెనాల్ వద్దు - మున్నేరు ప్రాజెక్టే ముద్దు" అని ప్రజలు ముక్తకంఠంతో నినదిస్తుంటే, వారి గోడు వినకుండా ఏకపక్షంగా వ్యవహరించడం పాలకుల ఉదాసీనతకు పరాకాష్ట అని ఆయన విమర్శించారు. ప్రభుత్వం తన మొండివైఖరిని వీడి, స్థానికుల మనోభీష్టం మేరకు సర్వే పనులను వెంటనే నిలుపుదల చేయాలని, లేనిపక్షంలో ప్రజా ఆగ్రహం తప్పదని పుణ్య నాయక్ హెచ్చరించడం నియోజకవర్గంలో చర్చనీయాంశంగా మారింది. అభివృద్ధి పేరిట ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తూ, ప్రజలను తమ సొంత గడ్డపైనే పరాయి వారిని చేయడం ఎంతవరకు సమంజసమని ఆయన ప్రశ్నించిన తీరు ప్రతి ఒక్కరినీ ఆలోచింపజేస్తోంది.



## ఫుట్‌పాత్‌లు మాయం..కాలిబాటపై మృత్యుపాశం!

- మృత్యు అంచున పాదచారుల ప్రయాణం: ఆక్రమణలపై 'ముద్రగడ' పోరాటం ఫలించేనా?
- కబళించే ఆక్రమణలు రోడ్లపైనే సామాన్యుడి మరణయానం!



ఇల్లందు పట్టణ గుండెకాయ వంటి జగదాంబ సెంటర్ నుండి బస్టాండ్ వరకు సాగుతున్న ఆక్రమణల పర్వం సామాన్య పౌరుల పాలిట శాపంగా మారింది. ఫుట్‌పాత్‌లను కొందరు వ్యాపారులు తమ సొంత ఆస్తులుగా మార్చుకోవడంతో, ప్రజలు రోడ్లపైకి నెట్టబడి ప్రాణాపాయ స్థితిలో ప్రయాణం సాగిస్తున్నారు. ఈ తీవ్రమైన ప్రజా సమస్యపై తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ అధ్యక్షులు ముద్రగడ వంశీ గత కొంతకాలంగా రాజీలేని పోరాటం చేస్తూనే ఉన్నారు. ప్రభుత్వ యంత్రాంగం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నా, ఆయన మాత్రం పట్టువదలకుండా ప్రతి ప్రభుత్వ కార్యాలయం చుట్టూ తిరుగుతూ, అనేకమార్లు లిఖితపూర్వక ఫిర్యాదులు అందజేశారు. అధికారుల నిర్లక్ష్యం వల్ల ఏ క్షణంలోనైనా ఘోర ప్రమాదం జరగవచ్చని, అభం శుభం తెలియని పాదచారుల ప్రాణాలు గాలిలో కలిసిపోయే ప్రమాదం ఉందని ఆయన పదేపదే హెచ్చరిస్తున్నారు. ఒకపక్క భారీ వాహనాలు, మరోపక్క ఆక్రమణల నడుమ నలిగిపోతున్న సామాన్యుడి గొంతుకై ముద్రగడ వంశీ చేస్తున్న ఈ పోరాటం, పాలకుల ఉదాసీనతను వేలెత్తి చూపుతోంది. ఇప్పటికైనా జిల్లా యంత్రాంగం స్పందించి ముద్రగడ వంశీ చేసిన ఫిర్యాదులపై చర్యలు తీసుకుంటుందో లేక ఏదైనా అరిష్టం జరిగే వరకు వేచి చూస్తుందో వేచి చూడాలి.

## కేరళ రాష్ట్రంలోని అడూర్ నియోజకవర్గానికి ఏఐసీసీ

జుక్కల్/ఏప్రిల్ 7/(జన సంఘర్షణ)



కేరళ రాష్ట్రంలోని అడూర్ నియోజకవర్గానికి ఏఐసీసీ పరిశీలకులుగా పర్యటించి తిరిగి వచ్చిన జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావుకి జుక్కల్‌లో ఘన స్వాగతం లభించింది. ఈ సందర్భంగా కామారెడ్డి జిల్లా డీసీసీ అధ్యక్షులు ఏలే మల్లికార్జున్ కు శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. అడూర్ నియోజకవర్గంలో పార్టీ కార్యకలాపాలను సమీక్షించి విజయవంతంగా పర్యటన పూర్తి చేసుకున్న తోట లక్ష్మీకాంతరావు , తిరిగి స్వగ్రామానికి చేరుకోవడంతో స్థానిక నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, పార్టీ బలోపేతానికి ఆయన చేస్తున్న కృషి ప్రశంసనీయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని ఎమ్మెల్యే కు స్వాగతం పలికి తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు.

## కామారెడ్డిలో కల్తీ కల్లు విక్రయాలు

- అధికారుల చర్యలపై ప్రజల అసంతృప్తి


కామారెడ్డి/ఏప్రిల్ 7/(జన సంఘర్షణ)



కామారెడ్డి జిల్లాలో అనుమతులు లేకుండా నడుస్తున్న కల్లు దుకాణాలపై అధికారులు చేపట్టిన చర్యలు నామ మాత్రంగానే మిగిలిపోయాయని, కల్తీ కల్లు విక్రయాలు యథావిధిగా కొనసాగుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. ప్రజల ఆరోగ్యం ప్రమాదంలో పడుతోందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కామారెడ్డి జిల్లాలో అనుమతులు లేకుండా నడుస్తున్న కల్లు దుకాణాలపై అధికారులు చేపట్టిన చర్యలు నామమాత్రంగానే మిగిలిపోయాయని, కల్తీ కల్లు విక్రయాలు యథావిధిగా కొనసాగుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. ప్రజల ఆరోగ్యం ప్రమాదంలో పడుతోందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో కేవలం రెండు కల్లు దుకాణాలకు మాత్రమే అధికారిక అనుమతులు ఉండగా, మరికొన్ని ప్రాంతాల్లో అనధికారికంగా కల్లు అమ్మకాలు జరుగుతున్నాయి. ఈ దుకాణాల్లో నాణ్యతలేని పదార్థాలతో కల్లును కల్తీ చేస్తున్నారని విశ్వసనీయ సమాచారం. దీనివల్ల ప్రజల ఆరోగ్యం తీవ్రంగా ప్రభావితమవుతోంది.

## వివేక్ నగర్ స్వయంబు ఆలయంలో ఏం పి లక్ష్మణ్ పూజలు.....

హైదరాబాద్ సిటిబ్యూరో /ఏప్రిల్ 7 ( జనసంఘర్షణ )



చిక్కడపల్లి వివేక నగర్ లోని స్వయంభుగా వెలసిన శ్రీ ఆంజనేయ స్వామి ఆలయంలో బిజెపి జాతీయ ఓబీసీ అధ్యక్షునిగా ఎంపీ డాక్టర్లకే లక్ష్మణ్ మంగళవారం పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ కే లక్ష్మణ మాట్లాడుతూ.. భారత ప్రధాని నరేంద్ర మోడీ అన్ని వర్గాల ప్రజల సంక్షేమం కోసం అహర్నిశలు కృషి చేస్తున్నారని అన్నారు. భారత సనాతన ధర్మం అని నిలబెట్టేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని పిలుపునిచ్చారు. బిజెపి పార్టీని బస్తీ కాలనీ పట్టణాలు గ్రామస్థాయి నుంచి జిల్లా జిల్లా స్థాయి నుంచి మరింత అభివృద్ధి చేసేందుకు ప్రతి కార్యకర్త సైనికుల పని చేయాలని పిలుపునిచ్చారు. పార్టీ కోసం పని చేసే ప్రతి కార్యకర్తకు తగిన గుర్తింపు ఇస్తుందని ఆయన స్పష్టం చేశారు. ప్రజా సమస్యలను పరిష్కరించడంలో బిజెపి నాయకులు కార్యకర్తలు మరింత ముందుకు రావాలని వారికి చేదోడువాలుగా తమ సహాయ సహకారాలు అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం జాయింట్ కన్వీనర్ ఏ వినయ్ కుమార్ ఓబిసి జాతీయ నాయకులు పూసరాజు, బిజెపి సికింద్రాబాద్ మహంకాళి జిల్లా అధ్యక్షులు గుండా గోని భరత్ గౌడ్, నేతలు రమేష్ రామ్, సాయి చంద్, ఉమేష్ ఆనంద్ రావు, చైర్మన్ జానకి సుధాకర్, ఈవో ఏం దేవానాదం, నవీన్ కుమార్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# వృత్తికి రక్షణేది? భద్రాద్రిలో గళమెత్తిన నాయి బ్రాహ్మణులు





కొత్తగూడెం ఏప్రిల్ 07 (జన సంఘర్షణ)

తరతరాలుగా సమాజానికి సేవ చేస్తూ, సంప్రదాయ వృత్తినే నమ్ముకున్న నాయి బ్రాహ్మణుల జీవితాల్లో నేడు అనిశ్చితి నీడలు అలుముకున్నాయి. తమ వృత్తి పరమైన అస్తిత్వాన్ని కాపాడుకోవడానికి మరియు పెండింగ్‌లో ఉన్న సమస్యల పరిష్కారం కోసం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా నాయి బ్రాహ్మణ సేవా సంఘం మంగళవారం జిల్లా వ్యాప్తంగా సమరశంఖం పూరించింది. జిల్లా కలెక్టరేట్ నుండి మొదలుకొని 23 మండలాల్లోని ఆర్డీవో కార్యాలయాల వరకు వినతిపత్రాల వెల్లువ కొనసాగింది. కుల వివక్షకు వ్యతిరేకంగా చట్టపరమైన రక్షణ, అన్యాక్రాంతమవుతున్న కులవృత్తిని కాపాడుకోవడం, మరియు ప్రభుత్వం ప్రకటించిన లక్ష రూపాయల ఆర్థిక సాయం అర్హులందరికీ చేరకపోవడం వంటి అంశాలు నేడు వారిని ఆవేదనకు గురిచేస్తున్నాయి. కేవలం ఓటు బ్యాంకు రాజకీయాలకే పరిమితం కాకుండా, తమ అభివృద్ధి కోసం ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు, రాజకీయ ప్రాతినిధ్యం కల్పించాలన్న వారి డిమాండ్ కేవలం ఒక వర్గపు అభ్యర్థన మాత్రమే కాదు, అది సామాజిక న్యాయం కోసం వేస్తున్న గట్టి అడుగు. ఆత్మగౌరవ భవనాల కోసం స్థల కేటాయింపు, జీవనోపాధి కోసం షెడ్ల నిర్మాణం వంటి ప్రాథమిక అవసరాల కోసం కూడా ఇన్నేళ్లుగా వీధుల్లోకి రావాల్సి రావడం వ్యవస్థలోని వైఫల్యాన్ని వేలెత్తి చూపుతోంది. సమస్యలు పరిష్కారం కాకపోతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామన్న వారి హెచ్చరిక, పాలకుల ఉదాసీనతపై వారికున్న నిరసనకు నిదర్శనం.

## ఇల్లందు మండలం నూతన తహశీల్దార్ సూర్యనారాయణ ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిసిన సందర్భంగా...


ఇల్లందు ప్రతినిధి :(జన సంఘర్షణ)



ఇల్లందు మండలానికి నూతన తహశీల్దార్‌గా నియమితులైన సూర్యనారాయణ ఈరోజు క్యాంప్ కార్యాలయంలో గౌరవ ఎమ్మెల్యేని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ భేటీలో ఎమ్మెల్యే మండల వ్యాప్తంగా ఉన్న వివిధ సమస్యలపై చర్చిస్తూ, ముఖ్యంగా రెవెన్యూ సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ప్రజలకు వేగవంతమైన సేవలు అందించే విధంగా పని చేయాలని, ప్రజల సమస్యలను సమయానికి పరిష్కరించేలా కృషి చేయాలని తహశీల్దార్‌ని ఆదేశించారు. ఇల్లందు మండల అభివృద్ధికి సమన్వయంతో పని చేయాలని ఈ సందర్భంగా ఇరువురు అభిప్రాయపడ్డారు.

## యుద్ధం ఎఫెక్ట్.. పాకిస్థాన్లో లాక్డౌన్

హైదరాబాద్ /ఏప్రిల్ 7/(జనసంఘర్షణ)



పశ్చిమాసియాలో కొనసాగుతన్న యుద్ధం ఇప్పటికే పలు దేశాల్లో ఇంధన సంక్షోభానికి కారణంగా నిలుస్తుంది. ఈ మేరకు ఆర్థిక సంక్షోభంలో ఉన్న పాకిస్థాన్లో ఇంధన సంక్షోభం తీవ్రం కావడంతో అక్కడి ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఈ పరిస్థితుల నుంచి బయటపడేందుకు 'స్మార్ట్ లాక్డౌన్' ప్రకటించింది. మార్కెట్లు, మాల్స్ అన్నింటినీ నేటి నుంచి రాత్రి 8 గంటలకే మూసివేయించాలని నిర్ణయం తీసుకుంది. రా.10 గంటలకే బేకరీలు, రెస్టారెంట్లు, ఫంక్షన్ హాళ్లు మూసివేయాలని పేర్కొంది. పంజాబ్, ఖైబర్ పంఖ్తుఖ్వా, బలూచిస్థాన్, ఇస్లామాబాద్, పిఓకేలోని ప్రాంతాలకు ఇది వర్తిస్తుందని పేర్కొంది.

## రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాలి

బోధన్ : ఏప్రిల్ 07 జన సంఘర్షణ



సిపిఎం పార్టీ బోధన్ ఏరియా కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం రోజున అంబేద్కర్ చౌరస్తా నుంచి ఆర్డీవో ఆఫీస్ వరకు ర్యాలీగా వచ్చి ఏ,ఓ కు సమస్యలు పరిష్కరించాలని ధర్నా చేసి వినతి పత్రం అందజేశారు. అనంతరం సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి ఏ .రమేష్ బాబు మాట్లాడుతూ.... రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో వైఫల్యం చెందింది. ఆరు హామీలను అమలు చేస్తామని ప్రభుత్వం వచ్చి రెండున్నర సంవత్సరాలు అవుతున్నప్పటికీ అమలు చేయడంలో వైఫల్యం చెంది తను తెలంగాణ రాష్ట్రంలో అమలు చేస్తున్న పథకాలు కేరళ రాష్ట్రంలో ఎన్నికలకు వెళ్లి తెలంగాణ వచ్చి చూడండి పథకాల అమలవుతున్నాయి కేరళా లో అధికారంలోకొస్తే మేము కూడా అలాగే అమలు చేస్తామని అబద్ధపు ప్రచారాలు చేస్తున్నారు. తెలంగాణలో తనిచ్చిన ఆరు పథకాలలో కొన్ని మాత్రమే అమలు చేస్తూ మసిపూసి మారేడు కాయ చేసే ప్రయత్నాలు చేస్తున్నారు ముఖ్యమంత్రి అరులైన మహిళలకు నెలకు 25 వేలు రూపాయలు ఇవ్వాలి. వ్యవసాయ కూలీలకు సంవత్సరానికి 12 వేలు ఇవ్వాలి, ఆటో కార్మికులకు సంవత్సరానికి 12, వేల రూ. ఇవ్వాలి. అలాగే పట్టణాలలో ఉపాధి హామీ పనులు కల్పించాలి. రైతులందరికీ రైతు భరోసా వెంటనే అమలు చేయాలి. యాసంగి పంటను వడ్లను కొనుగోలు వెంటనే ప్రారంభించాలి. సాలుర మండలంలో మందర్న. హున్స్ ఖాజాపూర్. గ్రామాలలో వర్షాకాలంలో పంటలు మునిగిపోయి నష్టపోయినారు ఎండాకాలం పంటలో వడగండ్ల వానలు రైతులు పడి నష్టపోయినారు వారిని వెంటనే ఆదుకోవాలి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు. అలాగే కొత్తగా పెన్షన్లు అర్హులైన వారందరికీ ఇవ్వాలి. వికలాంగులకు వృద్ధులకు వితంతువులకు పెన్షన్లు పెంచి ఇవ్వాలి. బోధన్ మండలం సాలూరు మండలం బోధన్ పట్టణంలో. గత బిఆర్ఎస్ టిఆర్ఎస్ ప్రభుత్వం. ఆ ప్రభుత్వం పంపిణీ చేయలేదు. డబల్ బెడ్ రూమ్ ఇండ్లను. ఇందిరమ్మ ఇండ్లను అలాగే కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి కూడా రెండున్నర సంవత్సరాలయితున్నప్పటికీ ఇండ్లను పంపిణీ చేయలేదు వాటిని వెంటనే అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇండ్లను పంపిణీ చేయాలని. వీటితో పాటు వ్యక్తిగతంగా స్థలం లేని వారికి స్థలం ఇచ్చి ఇంద్రమ్మ లోని కింద ఐదు లక్షల రూపాయలు ఇచ్చి నిర్మించి వాళ్ళని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేయడం జరిగింది లేనిపక్షంలో రాబోయే కాలంలో రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళన పోరాటాలు నిర్వహిస్తామని రాష్ట్ర కేంద్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐఎం పార్టీ జిల్లా కార్యదర్శి ఏ రమేష్ బాబు బోధన్ ఏరియా కార్యదర్శి జె.శంకర్ గౌడ్. సిపిఐ ఎం పార్టీ బోధన్ ఏరియా కమిటీ కార్యదర్శి వర్గ సభ్యులు. ఏషాల గంగాధర్. సిపిఎం పార్టీ కార్యకర్తలు నాయకులు దాసి గోపి. పత్రి ఎల్లయ్య. దండు సాయిలు. అలిగే గంగాధర్. బిల్లా నరసింహులు. నల్ల శ్రీనివాస్. పోశెట్టి. న్యాలం సురేష్. కల్లెం. నరసింహులు. సావిత్రి. పోచవ్వ. లక్ష్మి. రాజమణి.. కళావతి తదితరులు పాల్గొన్నారు.

# జుక్కల్‌లో అభివృద్ధి జోరు...



- ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావు - డీసీసీ అధ్యక్షులు ఏలే మల్లికార్జున్ సుడిగాలి పర్యటన..

జుక్కల్/ఏప్రిల్ 7/(జన సంఘర్షణ)

జుక్కల్ నియోజకవర్గంలో అభివృద్ధి కార్యక్రమాలు వేగంగా కొనసాగుతున్నాయి. ఈరోజు డోంగ్లి, మద్నూర్, బిచ్కుంద మండలాల్లోని పలు గ్రామాల్లో నిర్వహించిన సుడిగాలి పర్యటనలో భాగంగా జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావు, కామారెడ్డి జిల్లా డీసీసీ అధ్యక్షులు ఏలే మల్లికార్జున్ కలిసి పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా గ్రామాల్లో సిసి రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపనలు చేయడంతో పాటు, రైతులకు ఎంతో ఉపయోగపడే విధంగా ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. అభివృద్ధి పనులను వేగవంతంగా ముందుకు తీసుకెళ్తూ ప్రజల అవసరాలను తీర్చడంలో ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావు కీలక పాత్ర పోషిస్తుండగా, కార్యక్రమాల నిర్వహణలో డీసీసీ అధ్యక్షుడు ఏలే మల్లికార్జున్ చురుకైన పాత్ర పోషించారు. ఈ కార్యక్రమాల్లో స్థానిక నాయకులు, కార్యకర్తలు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని నాయకులకు ఘన స్వాగతం పలికారు. గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతులు మెరుగుపరచడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాలు కొనసాగుతున్నాయని నాయకులు తెలిపారు.



# కస్తూర్బా బాలికల విద్యాలయంలో టీచర్ అవతారం ఎత్తిన జిల్లా కలెక్టర్

◆ **సాదా సీదాగా ఇలాంటి కుర్చీలు, బెంచులు లేకుండా కిందనే కూర్చుండి విద్యార్థుల ప్రతిభను గుర్తించిన కలెక్టర్**

నిజామాబాద్ / ఏప్రిల్ 7/(జన సంఘర్షణ)

బాలికల విద్యాలయాల పర్యవేక్షణలో భాగంగా ఆ అధికారిని కస్తూర్బా విద్యాలయంలో ఓ టీచర్గా అవుతారం ఎత్తారు. కలెక్టర్గా తన హోదాను పక్కకు పెట్టి ఎలాంటి ఆర్భాటం హంగామా లేకుండా విద్యార్థులతో నేలపై కూర్చుండి విద్యార్థుల ప్రతిభ ను తెలుసుకున్నారు. కస్తూర్బాక పాఠశాలలో ఏమైనా సమస్యలు ఉన్నాయా, అని నిజామాబాద్ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి బాలికలలు అడిగి తెలుసుకున్నారు. మంగళవారం జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠివర్ని మండలం కోటయ్య క్యాంపులో కొనసాగుతున్న కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని కలెక్టర్ ఇలా త్రిపాఠి మంగళవారం సందర్శించారు. పాఠశాలలోని తరగతి గదులను పరిశీలించారు. సిబ్బంది అటెండెన్స్ రిజిస్టర్ లను తనిఖీ చేశారు. విద్యార్థులకు సిద్ధం చేసిన మెనూ వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం నాణ్యమైన పౌష్టిక ఆహారాన్ని అందించాలని నిర్వాహకులను ఆదేశించారు. పాఠశాల పరిసరాలు నిశితంగా పరిశీలించిన కలెక్టర్, పరిశుభ్రత పట్ల ప్రత్యేక దృష్టిని కేంద్రీకరించాలని అన్నారు. బాలికల భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని, బయటి వ్యక్తులను లోనికి అనుమతించకూడదని ఆదేశించారు. విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించే వారిని ఎంతమాత్రం ఉపేక్షించబోమని స్పష్టం చేశారు. అనంతరం 7వ తరగతి గదిని కలెక్టర్ సందర్శించి, విద్యార్థినులకు పలు ప్రశ్నలు వేస్తూ వారి అభ్యాసన సామర్థ్యాన్ని అంచనా వేశారు. తన వెంట తెచ్చిన డైరీలు, చాక్లెట్లు, బహుమతులను అందించారు. చక్కగా చదువుకోవాలని, అదే సమయంలో వ్యక్తిగత భద్రత విషయంలో ఏమరుపాటుగా ఉండకుండా అనుక్షణం అప్రమత్తంగా వ్యవహరించాలని జాగ్రత్తలు సూచించారు. ఏవైనా ఇబ్బందులు ఎదురైతే ధైర్యంగా అధికారులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. పాఠశాలకు అవసరమైన ఫర్నీచర్ కేటాయిస్తామని అన్నారు. వంటగది పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఈ విద్యాలయానికి నూతన భవనం మంజూరైనందున వెంటనే పనులు ప్రారంభం అయ్యేలా చూడాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా నూతన భవన నిర్మాణం కోసం ఎంపిక చేసిన స్థలాన్ని కలెక్టర్ పరిశీలించారు. కలెక్టర్ వెంట స్థానిక తహసీల్దార్ సాయిలు, కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ సరస్వతి తదితరులు ఉన్నారు.



# పదవ తరగతి మూల్యాంకనం, కుల గణన పారితోషికం చెల్లించాలి..

◆ **కామారెడ్డి స్పాట్ కేంద్రంలో ఉపాధ్యాయుల సంఘాల జెఎసి సంఘాల నిరసన ప్రదర్శన**

కామారెడ్డి /ఏప్రిల్7/(జన సంఘర్షణ)

పదవ తరగతి మూల్యాంకనం , కులగణన పారితోషికం చెల్లించాలి మంగళవారం కామారెడ్డి స్పాట్ కేంద్రంలో ఉపధ్యాయ సంఘాల జేఏసీ సంఘాల నిరసన ప్రదర్శన. ఎస్ఎస్సి మూల్యాంకనం కులగణన పారితోషికం చెల్లించాలని కామారెడ్డి జిల్లా కేంద్రంలోని పదో తరగతి స్పాట్ కేంద్రంలో ఉపాధ్యాయ సంఘాల జేఏసీ సంఘాల ఆధ్వర్యంలో భోజన విరామ సమయంలో నిరసన ప్రదర్శన చేయడం జరిగింది. ఈ మేరకు టిటిజెఏసి జిల్లా చైర్మన్ అల్లాపూర్ కుశాల్, యు ఎస్ పి సి జిల్లా చైర్మన్ ఆకుల బాబు , జాక్టో జిల్లా చైర్మన్ సయ్యద్ ఖలీముద్దీన్ మాట్లాడుతూ 2025 మార్చిలో నిర్వహించిన పదవ తరగతి స్పాట్ మూల్యాంకనం విధుల వారితోషకం సుమారు 20 కోట్ల రూపాయలు చెల్లించవలసి ఉంది. దీనితో పాటు రాష్ట్రంలో కుల గణన 50వేల మంది సిబ్బందితో నిర్వహించి 18 నెలలు గడుస్తున్నా ప్రభుత్వం పారితోషికం చెల్లించలేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. కులగనన సర్వే లో ఎన్యుమరేటర్ కు 10 వేలు సూపర్వైజర్లకు 12000 చొప్పున మొత్తం సుమారు 50 కోట్ల వరకు చెల్లించవలసి ఉంది. జనగణన పూర్తి చేసి 18 నెలలు గడుస్తున్నా ఈ పారితోషికాన్ని చెల్లించకపోవడం చాలా బాధాకరమని ఇది ఉద్యోగుల పట్ల ప్రభుత్వానికి ఉన్న నిర్లక్ష్యాన్ని తెలియజేస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. పదవ తరగతి మూల్యాంకన విధులకు చెల్లించే పారితోషకం గత ఏడు సంవత్సరాలుగా పెంచలేదని ఇంటర్ స్పాట్ రేట్లు రెండుసార్లు పెంచారని గుర్తు చేశారు. ఎస్ ఎస్ సి స్పాట్ రేట్లు కనీసం 50 శాతం పెంచాలని ఈ ఏడాది మూల్యాంకనం పూర్తి కాగానే స్పాట్ విధులు నిర్వహించిన ఉపాధ్యాయులకు పారితోషకం వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి ఇప్పటికే చెల్లించగా మిగిలిన అన్ని జిల్లాల లో 2025 మార్చి ౦౦ఏ స్పాట్ మూల్యాంకన పారితోషితన్ని, కుల గణన పారితోషికాన్ని విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘాల జేఏసీ నాయకులు టి పి టి ఎఫ్ జిల్లా అధ్యక్షులు చింతల లింగం ,టిఆర్టిఎఫ్ జిల్లా అధ్యక్షులు బషీర్, జిల్లా నాయకులు పంపరి ప్రవీణ్ కుమార్, ప్రభాకర్, ఉపాధ్యాయ సంఘం అధ్యక్షులు యాదయ్య, జిల్లా అధ్యక్షులు స్వామి గౌడ్, జిల్లా అధ్యక్షులు మనోహర్, జిల్లా అధ్యక్షులు వెంకటరమణ , జిల్లా అధ్యక్షులు మధుసూదన్ రెడ్డి ఉర్దూ టీచర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు కుర్షిత్ , జిల్లా అధ్యక్షులు రంగా వెంకటేశ్వర్ గౌడ్, పుట్ట శ్రీనివాస్ రెడ్డి ,పంపరి ప్రవీణ్ సాయిలు,శ్యాము కుమార్, లక్ష్మీ రాజం, రాజేశ్వర్ వివిధ మండలాల బాధ్యులు పెద్దఎత్తున పాల్గొన్నారు.




# మున్నేరు జలసాధన కమిటీ నాయకుల అరెస్టుపై గార్లలో ఆగ్రహం

◆ **నెహ్రూ సెంటర్లో ఘన నిరసన**
◆ **ప్రభుత్వ వైఖరిపై మండిపడ్డ నాయకులు**

ఇల్లందు ప్రతినిధి :(జన సంఘర్షణ)

గార్ల: మున్నేరు ప్రాజెక్టు భూ సర్వే పనులను అడ్డుకుంటారనే నెపంతో ఈరోజు తెల్లవారుజామున మున్నేరు జలసాధన కమిటీ నాయకులను అక్రమంగా అరెస్టు చేయడాన్ని ఖండిస్తూ గార్ల నెహ్రూ సెంటర్లో తీవ్ర నిరసన కార్యక్రమం నిర్వహించారు. మున్నేరు జలసాధన కమిటీ ఆధ్వర్యంలో జరిగిన ఈ నిరసనలో వివిధ ప్రజా సంఘాలు, రైతు సంఘాల నాయకులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఏఐకేఎంఎస్ జిల్లా కార్యదర్శి గుజ్జు దేవేందర్ మాట్లాడుతూ ప్రభుత్వ చర్యలను తీవ్రంగా విమర్శించారు. ప్రజల హక్కుల కోసం పోరాడుతున్న నాయకులను ముందస్తుగా అరెస్టు చేయడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని అన్నారు. మున్నేరు ప్రాజెక్టు పేరుతో రైతుల భూములను స్వాధీనం చేసుకునే ప్రక్రియలో పారదర్శకత లేకపోవడమే కాకుండా, బాధితులకు సరైన పరిహారం, పునరావాసం కల్పించడంలో ప్రభుత్వం విఫలమైందని ఆగ్రహం వ్యక్తం చేశారు.భూ సర్వే పనులు నిర్వహించే ముందు స్థానిక ప్రజలతో చర్చలు జరపకుండా, వారి అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోకుండా అధికారులు ముందుకు సాగడం అన్యాయమని ఆయన పేర్కొన్నారు. ప్రజలు తమ హక్కుల కోసం ప్రశ్నిస్తే వారిని అరెస్టు చేయడం సరైంది కాదని, ఇది అధికార దుర్వినియోగానికి నిదర్శనమని అన్నారు.అరెస్టు చేసిన కమిటీ నాయకులను వెంటనే విడుదల చేయాలని, మున్నేరు ప్రాజెక్టు భూ సర్వే పనులను తక్షణమే నిలిపివేసి రైతులతో చర్చలు జరపాలని డిమాండ్ చేశారు. లేకపోతే రాబోయే రోజుల్లో పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.ఈ నిరసన కార్యక్రమంలో పలు గ్రామాల రైతులు, మహిళలు, యువకులు పాల్గొని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. నాయకుల అరెస్టుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు.



# గుంపెల్లగూడెం అభివృద్ధికి కీలక అడుగు

◆ **ఎంపీని కలిసిన సర్పంచ్ కృష్ణవేణి**

ఖమ్మం జిల్లా సింగరేణి :ప్రతినిధి (జన సంఘర్షణ )

గుంపెల్లగూడెం గ్రామ అభివృద్ధి దిశగా మరో ముఖ్యమైన ముందడుగు పడింది. గ్రామ సర్పంచ్ గుగులోత్ కృష్ణవేణి, వీరబాబు మంగళవారం ఎంపీని మర్యాదపూర్వకంగా కలుసుకుని గ్రామానికి సంబంధించిన ప్రధాన సమస్యలు, అభివృద్ధి అవసరాలను వివరించారు.ఈ సందర్భంగా గ్రామంలో నెలకొన్న మౌలిక సదుపాయాల లోపాలు, తాగునీటి సమస్య, రహదారుల అభివృద్ధి, పారిశుద్ధ్యం మెరుగుదల, విద్యా మరియు ఆరోగ్య రంగాల బలోపేతానికి అవసరమైన నిధులు, సహకారం అందించాలని ఎంపీకి వినతిపత్రం సమర్పించారు. గ్రామ ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను సవివరంగా తెలియజేసి, వాటి పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే గ్రామంలో సంక్షేమ పథకాల అమలు, పేదల సమస్యల పరిష్కారం, యువతకు ఉపాధి అవకాశాల కల్పన వంటి అంశాలను కూడా ఎంపీ దృష్టికి తీసుకువెళ్లారు. గ్రామ సమగ్ర అభివృద్ధి కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలను సమర్థవంతంగా వినియోగించాల్సిన అవసరాన్ని సర్పంచ్ కృష్ణవేణి వివరించారు. ఇదే సమయంలో సీఎం రిలీఫ్ ఫండ్ కార్యక్రమంలో చురుకైన పాత్ర పోషిస్తూ, ప్రజల సేవలో ముందుంటున్నామని తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో బాధితులకు ఆర్థిక సహాయం అందించడంలో తమ వంతు కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. గ్రామ అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తున్న నాయకులుగా సర్పంచ్ కృష్ణవేణి, వీరబాబు సేవలను స్థానిక ప్రజలు అభినందిస్తున్నారు. ఈ సమావేశం గుంపెల్లగూడెం గ్రామ అభివృద్ధికి ఒక కీలక మలుపుగా మారాలని గ్రామస్తులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.



# అంబర్ పేటలో ప్లాంట్ వాటర్ తాగుతున్నారా...

హైదరాబాద్ సిటిబ్యూరో /ఏప్రిల్ 7(జనసంఘర్షణ )

అంబర్పేట పరిసర ప్రాంతాల్లో వాటర్ ప్యాకేజ్ యూనిట్లు వాటర్ ప్లాంట్ టాస్క్ ఫోర్స్ ఫుడ్ సేఫ్టీ అధికారులు ఆకస్మిక దాడులు మంగళ వారం నిర్వహించారు. అపరిశుభ్రత వాతావరణంలో త్రాగే నీరు తయారు చేస్తున్నట్టు సమాచారం అందడంతో నిబంధనలు ఉల్లంఘించిన ప్లాంట్లను సీజ్ చేశారు ఇటువంటి కలుషిత నీటి వల్ల ప్రజలు తీవ్ర అనారోగ్యం పాలయ్యే ప్రమాదం ఉందని అధికారు లు హెచ్చరించారు. ఈ నీరు త్రాగడం వల్ల మలేరియా డెంగు టైఫాయిడ్ వచ్చే అవకాశాలు ఎక్కువ ఉంటాయని అధికారులు తెలిపారు నాణ్యతలేని తాగునీటి విక్రాయాలపై కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు స్పష్టం చేశారు. అదేవిధంగా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ప్లాంట్ల ద్వారా సప్లై చేసే త్రాగునీరును తాగకుండా ఉండాలని వారు అన్నారు.



# జూలియాస్ సిజర్ నాటకం జనారంజకం...

హైదరాబాద్ సిటిబ్యూరో /ఏప్రిల్ 7( జనసంఘర్షణ )

విఖ్యాత ఆంగ్ల నాటక రచయిత విలియమ్ షేక్స్పియర్ రచించిన ప్రసిద్ధ నాటకం జూలియస్ సీజర్ శ్రీ త్యాగరాయ గానసభ ప్రధాన వేదిక పై భక్తి సాహిత్య సాంస్కృతిక అధ్యయన పరిశోధన వ్యవస్థ నిర్వహణలో రాష్ట్ర చలన చిత్ర అభివృధి సంస్థ రాష్ట్ర ఉన్నత విద్యా మండలి సంయుక్త సహకారం తో ప్రదర్శించారు జూలియస్ సీజన్ తను నమ్మిన సన్నిహితుడు కుట్ర తో హత్య కు గురి కావటం నాటకం లోని ప్రధాన అంశం. ఈ చారిత్రక నాటకం తెలుగు లో ప్రొఫెసర్ ప్రదీప్ కుమార్ దర్శకత్వం లో డాక్టర్ వందన సహా దర్శకత్వం వహించగా ప్రదర్శించారు జూలియస్ సీజర్ గా ఎనభై పై బడిన వయస్సు లోనూ ప్రదీప్ కుమార్ ఆద్యంతం హుషారు గా నటించారు అనంతరం జరిగిన సభా కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న రాష్ట్ర ఉన్నత విద్యా మండలి ఉపాధ్యక్షుడు ఇటికాల పురుషోత్తం మాట్లాడుతూ ప్రదీప్ కుమార్ చారిత్రక నాటక ప్రదర్శనలో ప్రతిభా వంతుడు అన్నారు గతం లో ఎన్నో సార్లు భాగ్యనగర చరిత్ర కి సంబంధించిన నాటకం ప్రదర్శించారూ అని గుర్తు చేశారు తెలుగు విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ఆచార్య కోట్ల హనుమంత రావు మాట్లాడుతూ డెభై సంవత్సరాలు గా ప్రదీప్ కుమార్ తెలుగు రంగస్థల అభివృద్ధికి విశేష కృషి చేస్తున్నారనీ ప్రశంసించారు నాబార్డ్ అసిస్టెంట్ జెనరల్ మేనేజర్ అబ్దుల్ హమీద్ ఖాన్ సంఖ్యా శాస్త్ర వేత్త దైవజ్ఞ శర్మ కళాభిమాని ఉమేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



# ఏప్రిల్ 10వ తేదీ నుంచి 20వ తేదీ వరకు డా.హిప్నో కమలాకర్ జయంతి వేడుకలు....

హైదరాబాద్ సిటిబ్యూరో /ఏప్రిల్ 7( జనసంఘర్షణ )

ఏప్రిల్ 10వ తేదీ నుంచి 20వ తేదీ వరకు డా.హిప్నో కమలాకర్ జయంతి వేడుకలు అమెరికా, లండన్,ఒరిస్సా, కర్నాటక, తమిళనాడు ఆంధ్రప్రదేశ్, తెలంగాణా రాష్ట్రాలలో నిర్వహిస్తున్నామని ప్రోగ్రెసివ్ సైకాలజిస్ట్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా అధ్యక్షురాలు డా.హిప్నో పద్మా కమలాకర్, తెలంగాణా సంఘ అధ్యక్షుడు సాగర్ల రఘు, జయశ్రీ తెలిపారు. డా హిప్నో కమలాకర్స్ మైండ్ అండ్ పర్సనాలిటీ కేర్ లో సోమవారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ప్రోగ్రెసివ్ సైకాలజిస్ట్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఉస్మానియా యూనివర్సిటీ సైకలాజికల్ స్టూడెంట్ కి స్కాలర్షిప్, ప్రభుత్వ స్కూల్, కాలేజీ, హోం, హాస్టల్లో మానసిక సమస్యలు, మూఢ నమ్మకాలు పై పోటీలు, అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు.

# సింగరేణి మండలంలో రైల్వే డబుల్ లైన్ భూ నిర్వాసితులపై కీలక సమావేశం

◆ **ఎకరానికి పరిహారం పై చర్చలు**
◆ **రైతుల డిమాండ్ 19 లక్షలు, అధికారుల ప్రతిపాదన 18 లక్షలు**




ఖమ్మం సింగరేణి ప్రతినిధి( జన సంఘర్షణ )

సింగరేణి మండల పరిధిలోని కోమట్లగూడెం గేట్, కారేపల్లి, కమలా పురం రెవెన్యూ పరిధిలో డోర్నకల్ నుంచి భద్రాచలం వరకు ప్రతిపాదిత రైల్వే డబుల్ లైన్ నిర్మాణానికి సంబంధించి భూ నిర్వాసిత రైతుల సమస్యలపై ఈరోజు కలెక్టర్ కార్యాలయంలో కీలక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి జాయింట్ కలెక్టర్, ఎస్డీసీ మేడం హాజరై, భూములు కోల్పోతున్న రైతులకు ఎకరానికి ఎంత పరిహారం (అవార్డు) ఇవ్వాలన్న అంశంపై విస్తృతంగా చర్చించారు. మూడు రెవెన్యూ పరిధులకు చెందిన రైతులు, మహిళా రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. గాదెపాడు గ్రామపంచాయతీ సర్పంచ్ భూక్యా రంజిత్ కుమార్, కమలాపురం ప్రాంతానికి చెందిన కోటి అప్పారావు, పాండియా నాయక్ తదితరులు కూడా హాజరయ్యారు. ఈ సందర్భంగా రైతులు తమ భూముల విలువను దృష్టిలో ఉంచుకుని ఎకరానికి కనీసం రూ.19 లక్షలు పరిహారం ఇవ్వాలని జాయింట్ కలెక్టర్ గారిని, ఎస్డీసీ మేడంని కోరారు. అయితే కలెక్టర్ఆదేశాల మేరకు ఎకరానికి రూ.18 లక్షలు వరకు పరిహారం ఇవ్వగలమని జాయింట్ కలెక్టర్ తెలిపారు. దీనిపై రైతులు స్పందిస్తూ చివరికి రూ.18 లక్షల 50 వేల రూపాయలకు అంగీకరిస్తామని స్పష్టం చేశారు. ఈ మేరకు రైతులందరూ తమ విన్నపాన్ని లిఖితపూర్వకంగా ఎస్డీసీ మేడంకి సమర్పించారు. రైతుల అభ్యర్థనను గౌరవ కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి, వారికి అనుకూలంగా పరిహారం అందేలా కృషి చేస్తామని ఎస్డీసీ మేడం హామీ ఇచ్చారు. ఈ సమావేశం భూ నిర్వాసిత రైతులకు న్యాయం జరిగే దిశగా ఒక ముఖ్యమైన అడుగుగా భావిస్తున్నారు.

జన సంఘర్షణ
తెలుగు దినపత్రిక



## కోహెడ మండల యాదవ సంఘం అధ్యక్షుడిగా పలుమారూ సంతోష్ యాదవ్ ఎన్నిక



**సిద్దిపేట :**
సిద్దిపేట జిల్లా కోహెడ మండల యాదవ సంఘం నూతన కార్యవర్గాన్ని ఘనంగా ఎన్నుకున్నారు. మండల యాదవ సంఘం అధ్యక్షుడిగా పలుమారూ సంతోష్ యాదవ్ రెండవసారి ఎన్నికయ్యారు. సంతోష్ యాదవ్ గతంలో అందించిన సేవలను గుర్తించి, సంఘం సభ్యులందరూ ఏకాభిప్రాయంతో ఆయనను మరోసారి అధ్యక్షుడిగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా సంతోష్ యాదవ్ మాట్లాడుతూ, తనపై నమ్మకంతో రెండోసారి బాధ్యతలు అప్పగించిన మండల యాదవ సోదరులకు పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు. యాదవ సంఘం బలోపేతానికి, సమాజంలోని నిరుపేద యాదవుల సంక్షేమానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. ప్రభుత్వ పథకాలు అర్హులైన ప్రతి యాదవ కుటుంబానికి అందేలా చూస్తానని, అలాగే సామాజిక ఐక్యత కోసం నిరంతరం శ్రమిస్తానని పేర్కొన్నారు. సంతోష్ యాదవ్ ఎన్నిక పట్ల మండలంలోని యాదవ సంఘం నాయకులు మరియు అభిమానులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## కరిమద్దెలలో ప్రారంభమైన తితిదే ధార్మిక కార్యక్రమాలు





**కర్నూల్ :**
గడివేములమండలం,కరిమద్దెల గ్రామంలో వెలసిన శ్రీ వేంకటేశ్వర స్వామి దేవస్థానం నందు తిరుమల తిరుపతి దేవస్థానములు హిందూ ధర్మ ప్రచార పరిషత్తు ఆధ్వర్యంలో మంగళవారం ధార్మిక కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. మొదటిరోజు కె. సిద్ధారెడ్డిచే శ్రీమద్రామాయణంపై ప్రవచనం, స్థానిక భజన మండలిచే భజన కార్యక్రమాలు నిర్వహించారు. శ్రీ వేంకటేశ్వర స్వామి దేవస్థానం నందు, శుక్రవారం వరకు ఉపన్యాసాలు, స్థానిక భజన మండలిచే భజన కార్యక్రమాలు నిర్వహించనున్నామని, శనివారం ఎస్సీ కాలనీలో నూతనంగా నిర్మాణమైన శ్రీ మాతా మారెమ్మ దేవస్థానం నందు భజన కార్యక్రమాలతో ఈ కార్యక్రమాలు ముగియనున్నాయని తిరుమల తిరుపతి దేవస్థానములు హిందూ ధర్మ ప్రచార పరిషత్తు ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ కార్యనిర్వాకులు డాక్టర్ మల్లు వేంకటరెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక భక్త సమాజ సభ్యులు ఎ.నారాయణరెడ్డి, ఎ. సోమసుందర రెడ్డి, యం. శివారెడ్డి, కె. శివారెడ్డి, బి. రామకృష్ణారెడ్డి, కె. వెంకట రామిరెడ్డి, యం. అయ్యన్న, కె. నారాయణ, ఎస్. శేఖర్ రెడ్డి, జి వెంకట రెడ్డి, కె. తులసిరెడ్డితో పాటు భజన మండలి సభ్యులు పాల్గొన్నారు.

## కెపిహెచ్ బి ఏడవ ఫేస్ లోని గీతాంజలి మోడల్ హైస్కూల్లో గ్రాడ్యుయేషన్ డే సంబరాలు



**కూకట్పల్లి :**
కూకట్పల్లి కేపీహెచ్ బి కాలనీ గీతాంజలి మోడల్ హైస్కూల్లో గ్రాడ్యుయేషన్ డే సెలబ్రేషన్స్ లు ఘనంగా జరిగినాయి ఈ కార్యక్రమంలో విద్యార్థులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్కూల్ ప్రిన్సిపల్ రవిబాబు మాట్లాడుతూ మా స్కూల్లో ఎటువంటి సెలబ్రేషన్స్ ఉన్న వాటిని తూచ తప్పకుండా నిర్వహిస్తుంటాము అలాగే విద్యార్థులకు క్రమశిక్షణ తల్లిదండ్రులతోటి అలాగే గురువులు మరియు పెద్దలు తోటి ఎలా నడుచుకోవాలో టీచర్స్ ఎంతో బాధ్యతగా చెప్పడం జరుగుతున్నది అలాగే ఈరోజు గ్రాడ్యుయేషన్ డే సందర్భముగా సెలబ్రేషన్స్ జరుపుతున్నాము ఈ సెలబ్రేషన్ లో విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రులను ఆహ్వానించి విద్యార్థులకు సర్టిఫికెట్ మరియు

# మల్లాపూర్ లో ప్రభుత్వ ఆసుపత్రి కోసం స్థల పరిశీలన

- ఎలిఫెంట్ సర్కిల్ వద్ద నిర్మాణానికి అనుకూలం:అధికారులు
- స్థల పరిశీలనలో ఉప్పల్ తహసిల్దార్ ఫూల్ సింగ్ చౌహాన్







**ఉప్పల్ :**
ఉప్పల్ నియోజకవర్గం నాచారం సర్కిల్ మల్లాపూర్ డివిజన్ పరిధిలోని మల్లాపూర్ ఎలిఫెంట్ సర్కిల్ వద్ద ప్రభుత్వ ఆసుపత్రి నిర్మాణానికి స్థలం అనుకూలంగా ఉందని అధికారులు అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. ఈ ప్రాంతానికి 100 పడకల ప్రభుత్వ ఆసుపత్రి మంజూరైన నేపథ్యంలో మంగళవారం ఆసుపత్రి నిర్మాణానికి అనువైన స్థలాల ఎంపికపై అధికారులు దృష్టి సారించారు. ఈ క్రమంలో ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి సూచనల మేరకు మల్లాపూర్ ఎలిఫెంట్ సర్కిల్ వద్ద సర్వే నంబర్ 84లో ఖాళీగా ఉన్న స్థలాన్ని పరిశీలించారు. స్థల పరిశీలనలో ఉప్పల్ మండల తహసిల్దార్ ఫూల్ సింగ్ చౌహాన్, మాజీ కార్పొరేటర్ పన్నాల దేవేందర్ రెడ్డి పాల్గొన్నారు. పరిశీలన అనంతరం ఈ స్థలం ఆసుపత్రి నిర్మాణానికి అనుకూలంగా ఉండటంతో పాటు అవసరాలకు సరిపోతుందని అధికారులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జలమండలి డీజీఎం వేణుగోపాల్, మేనేజర్ రోహిత్,సర్వేర్ వెంకన్న, రెవెన్యూ అధికారులు,స్థానిక నాయకులు తండా వాసుగౌడ్, తిగుళ్ల శ్రీనివాస్ గౌడ్, పైళ్ల ప్రవీణ్, అల్లాడి కృష్ణ యాదవ్, పద్మరెడ్డి,ఉస్మాన్,రఘు తదితరులు పాల్గొన్నారు.

# పారిశుద్ధ్య కార్మికులకు ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే బండారు లక్ష్మారెడ్డి





**ఉప్పల్ :**
ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా కాప్రా సర్కిల్ కార్యాలయంలో పారిశుద్ధ్య, ఎంటమాలజీ మరియు ట్రాన్స్పోర్ట్ వర్కర్ల కోసం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. నాచారం ప్రసాద్ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ శిబిరాన్ని ఉప్పల్ ఎమ్మెల్యే బండారు లక్ష్మారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, నగర శుభ్రత కోసం కష్టపడుతున్న పారిశుద్ధ్య కార్మికుల ఆరోగ్యం సంరక్షణకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందన్నారు. ఇలాంటి హెల్త్ క్యాంప్ల ద్వారా వారికి నాణ్యమైన వైద్య సేవలు అందించడం అభినందనీయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమం లో కాప్రా సర్కిల్ డిప్యూటీ కమిషనర్ శ్రీహరి, చీఫ్ మెడికల్ ఆఫీసర్ పద్మ, మెడికల్ ఆఫీసర్ మమత, మేనేజ్మెంట్ ప్రతినిధి రవి, నాచారం డీఈఈ రవిచంద్, శాంతి, సూపర్వైజర్ సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు. ప్రసాద్ హాస్పిటల్కు చెందిన డాక్టర్ హర్షవర్ధన్, డాక్టర్ రామన్ రావు మరియు పారామెడికల్ సిబ్బంది పాల్గొని కార్మికులకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించి, ఆరోగ్య సూచనలు అందించారు.

## కళ్యాణ లక్ష్మి,షాదీముబారక్, సీఎం సహాయనిధి చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే జారె





**చంద్రుగొండ :**
అశ్వారావుపేట నియోజకవర్గం చంద్రుగొండ మండల కేంద్రంలో రైతు వేదిక నందు మంగళవారం ఎమ్మెల్యే జారె ఆదినారాయణ, కళ్యాణలక్ష్మీ షాదీముబారక్ ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. ఈ పథకాలకు అనతి కాలంలోనే అత్యధిక నిధులు మంజూరు చేసిన తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వానికి ఎమ్మెల్యే కు కృతజ్ఞతలు తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కి ఉమ్మడి ఖమ్మం జిల్లా మంత్రులైన ఉపముఖ్యమంత్రి బట్టి విక్రమార్క కి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కి, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, కి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో అశోక్, రెవెన్యూ సిబ్బంది రామారావు, పాషా, హౌసింగ్ ఏఈ వినయ్, భోజ్యానాయక్, అంకిరెడ్డి కృష్ణారెడ్డి, నల్లమోతు రమణ, తుమ్మలపల్లి సురేష్, బడుగు కృష్ణవేణి, సారేపల్లి శేఖర్, ఎస్సై శివరామకృష్ణ, సర్పంచులు ఉపసర్పంచులు ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి ఒక్కరూ ప్రాణదాతలు కావాలి

- ప్రముఖ గుండె వైద్య నిపుణులు రామక శ్రీనివాస్
- ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా 'క్వాలిటీ సీపీఆర్' శిక్షణ ప్రారంభం



**హనుమకొండ :**
ప్రపంచ ఆరోగ్య దినోత్సవం (ఏప్రిల్ 7) సందర్భంగా శ్రీవాస హెల్త్ సెంటర్, శ్రీవాస హెల్త్ ఫౌండేషన్ సంయుక్తంగా వినూత్నమైన జాతీయ స్థాయి శిక్షణ కార్యక్రమానికి శ్రీకారం చుట్టాయి. 2026 ప్రపంచ ఆరోగ్య దినోత్సవ ఇతివృత్తం “ఆరోగ్యం కోసం కదిలిద్దాం, ప్రాణానికి అండగా నిలుద్దాం” అనే నినాదానికి అనుగుణంగా ఈ కార్యక్రమం రూపొందించబడింది. శ్రీవాస సంస్థ 1999 నుండి కమ్యూనిటీ కార్యక్రమాలను, 2009 నుండి సామాన్య ప్రజలకు సీపీఆర్ (CPR) శిక్షణను అందిస్తోంది. నూతన లక్ష్యంతో 2025లో ఉన్నత పాఠశాల విద్యార్థుల కోసం ప్రారంభించిన ఈ కార్యక్రమాన్ని, ఇప్పుడు దేశవ్యాప్తంగా ప్రతి పౌరుడికి చేరవేసేలా విస్తరించారు. ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయ సిబ్బంది, పాఠశాలలు, కళాశాలలు, ఎన్.సి.సి (NCC), ఎన్.ఎస్.ఎస్ (NSS) క్యాడెట్లు, పోలీసులు, ఆర్టీసీ (RTC) సిబ్బంది, స్వయం సహాయక సంఘాలకు ఈ శిక్షణ ఇస్తారు. అధునాతన పద్ధతులతో అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా క్యూ-సీపీఆర్ (Q-CPR) మానిక్యూన్లను మరియు ఏఈడీ (AED) యంత్రాలను ఉపయోగించి హ్యాండ్స్-ఆన్ శిక్షణ అందజేస్తారు. ముఖ్య ఉద్దేశ్యంతో ఆకస్మిక గుండెపోటు వంటి అత్యవసర సమయాల్లో ప్రాథమిక చికిత్స అందించి, ప్రాణనష్టాన్ని నివారించడమే ఈ ఏడాది కాల పరిమితి గల ప్రాజెక్ట్ లక్ష్యం. ఈ శిక్షణ ద్వారా సామాన్య ప్రజలు సైతం అత్యవసర సమయాల్లో ప్రాణదాతలుగా మారే అవకాశం ఉంటుందని నిర్వాహకులు తెలిపారు.

జన సంఘర్షణ
మా లక్ష్యం సామాన్యుని పక్షం
తెలుగు దినపత్రిక
బుధవారం
08 ఏప్రిల్ 2026


## శంషాబాద్ ఎయిర్పోర్ట్ పోలీస్ ఔట్ పోస్టులో లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కిన ఇద్దరు ఎస్ఐలు





**హైదరాబాద్ /ఏప్రిల్ 7/(జన సంఘర్షణ)**
శంషాబాద్ ఎయిర్పోర్ట్ వద్ద గల ఔట్ పోస్ట్ లో పనిచేసే ఇద్దరు ఎస్సైలు ఒక వ్యక్తికి కేసులో చార్జిషీట్ వేయడానికి 5 లక్షల రూపాయల లంచం డిమాండ్ చేసి, రెండు లక్షల రూపాయలు లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు దాడులు చేసి ఇద్దరు ఎస్ఐలను వలవేసి పట్టుకున్నారు. 2 లక్షల రూపాయల నగదు స్వాధీనం చేసుకున్నారు.సంబంధించి, కేసులో చార్జిషీట్ను త్వరగా దాఖలు చేయడానికి , నిందితులకు షరతులతో కూడిన బెయిల్లో ఉపశమనం కలిగించడానికి, ఇన్స్పెక్టర్ కనకయ్య, ఎస్ఐ సిద్దేశ్వర్ తో కలిసి నిందితుడి నుండీ రూ. 5 లక్షలు డిమాండ్ చేశారు. మంగళవారం 2 లక్ష రూపాయలులంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు , ఇద్దరి ఎస్సైలను అదుపులోకి తీసుకున్నారు


# పెద్దకర్మ




గురువారం
19వ తేదీ మధ్యాహ్నం
బేగరి బాబయ్య
జననం: 1-1-1941
మరణం: 7-4-2026


## సింగరేణి మండలంలో రైల్వే డబుల్ లైన్ భూ నిర్వాసితులపై కీలక సమావేశం

**ఎకరానికి పరిహారం పై చర్చలు -- రైతుల డిమాండ్ 19 లక్షలు, అధికారుల ప్రతిపాదన 18 లక్షలు**



**ఖమ్మం సింగరేణి ప్రతినిధి( జన సంఘర్షణ )**
సింగరేణి మండల పరిధిలోని కోమట్లగూడెం గేట్, కారేపల్లి, కమలాపురం రెవెన్యూ పరిధిలో డోర్నకల్ నుంచి భద్రాచలం వరకు ప్రతిపాదిత రైల్వే డబుల్ లైన్ నిర్మాణానికి సంబంధించి భూ నిర్వాసిత రైతుల సమస్యలపై ఈరోజు కలెక్టర్ కార్యాలయంలో కీలక సమావేశం నిర్వహించారు.
ఈ సమావేశానికి గౌరవ జాయింట్ కలెక్టర్ గారు, ఎస్డీసీ మేడం గారు హాజరై, భూములు కోల్పోతున్న రైతులకు ఎకరానికి ఎంత పరిహారం (అవార్డు) ఇవ్వాలన్న అంశంపై విస్తృతంగా చర్చించారు. మూడు రెవెన్యూ పరిధులకు చెందిన రైతులు, మహిళా రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. గాదెపాడు గ్రామపంచాయతీ సర్పంచ్ భూక్యా రంజిత్ కుమార్, కమలాపురం ప్రాంతానికి చెందిన కోటి అప్పారావు, పాండియా నాయక్ తదితరులు కూడా హాజరయ్యారు.
ఈ సందర్భంగా రైతులు తమ భూముల విలువను దృష్టిలో ఉంచుకుని ఎకరానికి కనీసం రూ. 19 లక్షలు పరిహారం ఇవ్వాలని జాయింట్ కలెక్టర్ గారిని, ఎస్డీసీ మేడం గారిని కోరారు. అయితే కలెక్టర్ గారి ఆదేశాల మేరకు ఎకరానికి రూ. 18 లక్షలు వరకు పరిహారం ఇవ్వగలమని జాయింట్ కలెక్టర్ తెలిపారు.
దీనిపై రైతులు స్పందిస్తూ చివరికి రూ. 18 లక్షల 50 వేల రూపాయలకు అంగీకరిస్తామని స్పష్టం చేశారు. ఈ మేరకు రైతులందరూ తమ విన్నపాన్ని లిఖితపూర్వకంగా ఎస్డీసీ మేడం గారికి సమర్పించారు. రైతుల అభ్యర్థనను గౌరవ కలెక్టర్ గారి దృష్టికి తీసుకెళ్లి, వారికి అనుకూలంగా పరిహారం అందేలా కృషి చేస్తామని ఎస్డీసీ మేడం హామీ ఇచ్చారు. ఈ సమావేశం భూ నిర్వాసిత రైతులకు న్యాయం జరిగే దిశగా ఒక ముఖ్యమైన అడుగుగా భావిస్తున్నారు.

## కలెక్టర్ 'షాక్ ట్రీట్మెంట్': ఇద్దరు వార్డెన్లు సస్పెండ్

**'పద్ధతి మార్చుకోకుంటే ఇంటికే' - ఇద్దరు వార్డెన్ల వేటు!**



**ఇల్లందు ఏప్రిల్ 07 (జన సంఘర్షణ)**
బాధ్యత మరిచిన యంత్రాంగానికి భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ అంకిత్ గట్టి హెచ్చరికలు జారీ చేశారు. మంగళవారం ఇల్లందు పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రి, గిరిజన సంక్షేమ పాఠశాలలు మరియు వసతి గృహాల్లో ఆయన నిర్వహించిన మెరుపు తనిఖీలు జిల్లా యంత్రాంగంలో ప్రకంపనలు సృష్టించాయి. ముఖ్యంగా, విద్యార్థుల కడుపు నింపాల్సిన వసతి గృహాల్లో మెనూ పాటించకపోవడం, అపరిశుభ్రత రాజ్యమేలుతుండటంపై కలెక్టర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. విధుల్లో తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శించిన ఆశ్రమ పాఠశాల వార్డెన్ భరత్తో పాటు, సిబ్బంది ఎవరూ లేని ఎస్సీ హాస్టల్ వార్డెన్ను తక్షణమే సస్పెండ్ చేయాలని ఆదేశించారు. "అధికారిక హోదా అంటే కేవలం కుర్చీలకు పరిమితం కావడం కాదు, పేద విద్యార్థుల సంక్షేమమే పరమావధిగా పని చేయాలి" అని స్పష్టం చేసిన కలెక్టర్ తీరు, విధుల్లో నిర్లక్ష్యం వహించే మరికొందరు అధికారుల గుండెల్లో రైళ్లు పరిగెత్తిస్తోంది. పాలకుల పర్యవేక్షణ లోపిస్తే వ్యవస్థలు ఎలా కుప్పకూలుతాయో చెప్పడానికి ఈ తనిఖీలే నిదర్శనం.

## భాగ్యనగర్ తండా ప్రజల సమస్యల పరిష్కారానికి ఎంపీని కలిసిన యువజన కాంగ్రెస్ నాయకుడు



**సింగరేణి, ఏప్రిల్ 07 ప్రతినిధి (జన సంఘర్షణ )**
ఖమ్మం జిల్లా సింగరేణి మండలం పరిధిలోని భాగ్యనగర్ తండా గ్రామ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గుగులోత్ హచ్చు (హర్ష నాయక్) ఖమ్మం పార్లమెంట్ సభ్యుడు రామసహాయం రఘురాంరెడ్డి గారిని కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భాగ్యనగర్ తండా మరియు పరిసర ఐదు తండాలకు చెందిన రైతులు, రైతు కూలీలు ప్రతిరోజూ తమ వ్యవసాయ భూములకు వెళ్లడానికి రైల్వే ట్రాక్ను దాటాల్సి వస్తోందన్నారు. అయితే రైల్వే అధికారులు ట్రాక్ దాటేందుకు అనుమతి నిరాకరిస్తుండటంతో గ్రామ ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. ఈ సమస్యపై ఇప్పటికే పలుమార్లు సంబంధిత అధికారులకు వినతులు సమర్పించినప్పటికీ ఎటువంటి చర్యలు తీసుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ట్రాక్ను అనుమతి లేకుండా దాటితే కేసులు నమోదు చేస్తామని అధికారులు హెచ్చరిస్తుండటంతో ప్రజల్లో భయాందోళనలు నెలకొన్నాయని పేర్కొన్నారు.
అందువల్ల జరుపుల బాలాజీ చేను సమీపంలోని రైల్వే స్తంభం నెంబర్ ఖా/5/5 వద్ద అండర్గ్రౌండ్ బ్రిడ్జి లేదా రైల్వే గేట్ ఏర్పాటు చేయాలని ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి గారిని కోరినట్లు తెలిపారు.
ఈ సమస్యను సానుకూలంగా పరిశీలించి సంబంధిత అధికారులతో చర్చించి తగిన చర్యలు తీసుకుంటానని ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి గారు హామీ ఇచ్చినట్లు వెల్లడించారు. గ్రామ ప్రజల రాకపోకలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

## ఎసిబికి చిక్కిన అగ్రి వర్సిటీ అసోసియేట్ డీన్

**హైదరాబాద్, ఏప్రిల్7 :**
ఎన్ని దాడులు జరుగుతున్నా లంచావతారాలు మారడం లేదు. నిత్యం ఎక్కడో చోట లంచగొండులు పట్టుబడుతూనే ఉన్నారు. ఆచార్య జయశంకర్ అగ్రికల్చర్ వర్సిటీ అసోసియేట్ డీన్ గోవర్ధన్ అవినీతి నిరోధక శాఖ అధికారులకు చిక్కారు. ఒక విత్తన కంపెనీ నుంచి రూ.లక్ష లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు రెడ్ హ్యాండెడ్గా చిక్కారు. ఈ క్రమంలో రాజేంద్రనగర్లోని అగ్రికల్చర్ కళాశాలతో పాటు, ఎల్బీనగర్లోని గోవర్ధన్ ఇంట్లో ఏసీబీ అధికారులు సోదాలు నిర్వహిస్తున్నారు.

Printed, published and owned by Rachamallu Madhavi Printed at Kranthi Printing Press, 42/603/1/1-a, Mj Colony, Street no 5, Mjcolony, Moulali Secundrabad, and Published from h.no: 10-10-117/150, Nayi brahmana colony. Neerugonda Hanuman road, Nagaram Nizamabad (m&d) 503001, Telangana, Editor : Rachamallu Madhavi. RNI Reg No :tel/2024/89323, Cell 6305026524, Email:janasangarshana@gmail.co